Aham Hidayaten
(Telugu)

ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలకు

ముఖ్య హితవులు

రచన
మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)

అనువాదం
అబ్దుర్రహ్మాన్ (సాబిర్)

కృపాకరుడు దయాసాగరుడు అయిన అల్లాహ్ పేరుతో

ముందుమాట

ఇది మౌలానా మౌదూదిగారు కరాచీలో జరిగిన "జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్" కార్యకర్తల సమావేశంలో చేసిన ఒక ప్రసంగం.

ఈ ప్రసంగంలో అనేక సైద్ధాంతిక నిర్దేశాలు, ధార్మిక హితవులు వుండటం మూలాన దీని ప్రయోజనం ఒక ప్రత్యేక ప్రాంతానికి పరిమితంకాదు. అందువల్లనే మన దేశంలో ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల కొరకు దీన్ని అనువదించి సమర్పిస్తున్నాము.

ఈ "హితవులు" సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ ఇస్లామీయ ఉద్యమంలో కృషి సలిపే కార్యకర్తలు అందరికీ ఇతోధికంగా ఉపకరిస్తాయని ఆశిస్తున్నాము.

హైదరాబాద్
23-3-1978

ఎస్.ఎమ్. మలిక్

విషయ సూచిక

1.	అల్లాహ్‌తో సంబంధం	5
2.	ఆఖిరత్ (పరలోకం)	17
3.	అహంభావానికి దూరంగా ఉండటం	23
4.	పరిసరాల సంస్కరణ	28
5.	కిం కర్తవ్యం?	41
6.	మహిళలకు హితవులు	45

అల్లాహ్‌తో సంబంధం

అల్లాహ్‌తో సంబంధం – దాని ప్రాముఖ్యత

దైవ ప్రవక్తలు, పవిత్ర ఖలీఫాలు మరియు ముస్లిమ్ సంఘ మహాపురుషులు ఎల్లప్పుడు తమ సహచరులకు, అల్లాహ్‌కు భయపడమని ఆయన్ని అన్నిటికంటె అధికంగా ప్రేమించమని, ఆయనతో సంబంధం పెంపొందించుకొనవలెనని హితోపదేశం చేశారు. నేను కూడా వారి విధానాన్నే అనుసరిస్తూ ఎల్లప్పుడు మా సహచరులకు అన్నిటికంటే ముందు ఈ హితవునే చేశాను. మున్ముందు కూడా ఈ హితవునే చేస్తూ వుంటాను. ఎందుకనగా అన్ని విషయాలకంటే ఇది ఎంతో ముఖ్యమయింది. విశ్వాసాలలో అల్లాహ్‌పై విశ్వాసం ప్రముఖమైనది; నడవడికలో దైవభీతి ప్రముఖమైనది; వ్యవహారాలలో అల్లాహ్ ప్రీతిని పొందగోరుట ప్రముఖమైనది. మొత్తం మీద మనపూర్తి జీవితపు బాగోగులు, మన కృషిలో, మన ప్రయత్నాలలో అల్లాహ్ ప్రీతిని పొందే ఉద్దేశం ప్రముఖంగా యుండుటపైనే ఆధారపడి ఉండాలి. ప్రత్యేకంగా ఏ కార్య సాధనకై మనం ఒక 'జమాఅత్'గా ఏర్పడినామో, ఆ కార్యం సంపూర్ణంగా దైవ సంబంధంపైనే కొనసాగగలదు. దేవునితో మన సంబంధం ఎంత పటిష్ఠంగా ఉంటుందో అది కూడా అంతే పటిష్ఠంగా ఉంటుంది. మరియు దేవునితో మన సంబంధం ఎంత బలహీనంగా

ఉంటుందో అదీ అంతే బలహీనంగా ఉంటుంది. (దైవం మన్నించుగాక)

మనిషి ఏ ఉద్దేశ్యంతో ఒక కార్యాన్ని చేయదలుస్తాడో అది లోక కార్యమైనా లేక ధర్మానిదైనా ఆ ఉద్దేశ్యమే దానికి అసలు ప్రేరణ అనే విషయం జగద్విదితమే. ఉద్దేశ్యం పట్ల మనిషికివున్న శ్రద్ధలో ఉత్తేజం, ప్రగాఢత వున్నప్పుడే ఆ కార్యంలో అత్యధిక చురుకుదనం జనిస్తుంది. "స్వయం" కొరకు పని చేసేవాడు స్వార్థం లేకుండా "స్వయం సేవన" చెయ్యలేడు. ఇంకా ఆత్మప్రీతి ఎంత ప్రగాఢంగా వుంటుందో అంతే వుత్తేజంతో అతడు స్వయాన్ని సేవిస్తూ వుంటాడు. బిడ్డల సంక్షేమం కొరకు పాటుపడే వ్యక్తి వారి ప్రేమలో పిచ్చివాడౌతాడు. అప్పుడే అతడు తన సుఖ సంతోషాలను బిడ్డల మేలుకై త్యాగం చేస్తాడు. తన బిడ్డల సౌఖ్యం కొరకు అతడు తన ఇహ పరాలను కూడా నష్టపరచుకొనడానికి సిద్ధమవుతాడు. జాతి లేక దేశానికై పాటుపడే వాడు దేశం మరియు జాతుల ప్రేమలో బందీ అవుతాడు. అప్పుడే అతడు తన దేశం, జాతుల స్వాతంత్ర్యం కొరకు, వాటి రక్షణ కొరకు వాటి ఔన్నత్యానికి ధన, ద్రవ్య నష్టాలను భరిస్తాడు. కారాగార శిక్షలను అనుభవిస్తాడు. రాత్రింబవళ్ళు కృషి చేస్తాడు. అంతే కాదు ప్రాణాన్ని కూడా త్యాగం చేస్తాడు.

ఇప్పుడు మనం ఈ కార్యాన్ని మన స్వప్రయోజనం కొరకు చేయడం లేదు. ఏ కుటుంబ ప్రయోజనాలు కూడా దీని ప్రేరణ కాదు. దీనిలో దేశం, జాతుల ప్రయోజనాలు కూడా మన దృష్టిలో లేవు. కాని కేవలం అల్లాహ్‌ను సంతోష పెట్టడమే మన వాంఛ. ఇది ఆయన కార్యం అనుకొనే మనం దానిని చేపట్టాము. అందుచేత, అల్లాహ్‌తో మన సంబంధం ప్రగాఢంగా, పటిష్ఠంగా ఉండనంత వరకు ఈ కార్యం నిర్వహింపబడజాలదని మీరు స్వయంగా గ్రహించగలరు. ఈ కార్యంలో ఒరవడిగ ఉత్తేజం రావాలంటే సర్వ శ్రద్ధాశక్తులు దైవ ధర్మోన్నతి కొరకు చేసే యత్నంలో లగ్నం కావాలి. ఈ కార్యంలో ఎవరైతే పాల్గొంటున్నారో వారి సంబంధం కేవలం అల్లాహ్‌తో మాత్రమే

ఉండాలి. ఈ సంబంధం అనేక సంబంధాల్లోని ఒక సంబంధమై ఉండరాదు. ఒకే సంబంధంగా యదార్థమైనదిగా ఉండాలి. అంతేకాదు, అల్లోహ్‌తో సంబంధం బలహీన పడకుండా దినదినాభివృద్ధి చెందుతూ ప్రగాఢమౌతూ ఉండాలనే చింత వారిలో నిత్యం తేజోవంతంగా ఉండాలి.

అల్లోహ్‌తో సంబంధమే మన ఈ కార్యానికి జీవం అనే విషయంలో మన మధ్య రెండు అభిప్రాయాలు లేవు. సంఘం(జమాఅత్) లోని ఏ అనుచరుడును దేవుని దయవల్ల, దీని ప్రాముఖ్యతను గ్రహించటాన్ని ఉపేక్షించటం లేదు. అయితే కొన్ని ప్రశ్నలు చాలా మందిని ఆందోళన పరుస్తుంటాయి. అవిః అల్లోహ్‌తో సంబంధమంటే సరియైన అర్థమేమి? అది ఏర్పడి వృద్ధిపొందే మార్గమేది? వాస్తవంగా మన సంబంధం అల్లోహ్‌తో ఉన్నదా, లేదా, ఉంటే ఎంత ఉంది? అని మనం ఏ విధంగా తెలుసుకోగలము? ఈ ప్రశ్నలకు సరియైన జవాబులు తెలియకపోవడం చేత ప్రజలు తాము ఒక అంతుచిక్కని, దారి దొరకని ఎడారిలో ఉన్నామని భావిస్తారు. వారి గమ్యస్థానం అసలు ఏ దిశలో ఉందో వారికి అర్థం కాదు. వారు ఎంత దూరం ప్రయాణం చేశారో, ఇప్పుడు ఏ దశలో ఉన్నారో ఇంకా మున్ముందు ఎన్ని దశలున్నాయో వారి ఊహకందదు. ఈ విషయాన్ని నేను తరచుగా గమనిస్తూ ఉన్నాను. ఈ కారణం చేత పలుమార్లు మన సహచరులలో ఎవరయినా అస్పష్టమైన భావాల్లో పడిపోతూ ఉంటే మరొకతను లక్ష్యం వైపునకు కొనిపోని మార్గాల వైపునకు మరలుతూ ఉంటాడు. ఇంకొకనికి, లక్ష్యంతో దూర సంబంధం గల లేక దగ్గర సంబంధం గల విషయాలలో వ్యత్యాసం కనుగొనడం కష్టమవుతోంది. మరొకరు చకితులయి కూర్చుంటున్నారు. కనుక నేను నేడు కేవలం "అల్లోహ్‌తో సంబంధం" అనే విషయాన్ని గురించే గాక నాకు తెలిసినంత వరకు పై ప్రశ్నలకు కూడా స్పష్టమైన జవాబు లివ్వడానికి ప్రయత్నిస్తాను.

అల్లాహ్‌తో సంబంధం – దాని అర్థం

ఖుర్‌ఆన్‌లో సూచించినట్లుగా అల్లాహ్‌తో సంబంధం అంటే మనిషి జీవన్మరణాలు, ఆరాధనలు, త్యాగాలు సర్వస్వం అల్లాహ్ కొరకే అని అర్థం.

"నా నమాజ్, నా ఖుర్బాని, నా జీవితం, నా మృత్యువు, సమస్తం సర్వ లోకాల ప్రభువయిన అల్లాహ్ కొరకే."

అతడు ఏకాగ్ర దృష్టితో తన దీన్‌ను (జీవన విధానాన్ని) కేవలం అల్లాహ్ (విధేయత) కొరకే ప్రత్యేకించి, ఆయన విధేయతను పాటించాలి.

"అల్లాహ్‌ను ఆరాధించాలనీ ఆయన కొరకు జీవన ధర్మాన్ని ఏక దీక్షతో ప్రత్యేకించుకోవాలని తప్ప మరేమీ ఆదేశించబడలేదు." ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనేక సందర్భాల్లో ఈ సంబంధం యొక్క భావార్థాలను తమ బోధనల్లో స్పష్టపరచారు. హజ్రత్ ముహమ్మద్(సఅసం) ఉపదేశాల కనుగుణంగా అల్లాహ్‌తో సంబంధమేమనగా! "బహిరంగంగా, చాటుగా చేసే అన్ని పనులలో అల్లాహ్‌కు భయపడటం" ఇంకా, "నీ నమ్మకం, నీ సాధనా సంపత్తిపై కంటె అల్లాహ్ శక్తిపై ఎక్కువగా ఉండాలి" "మనిషి అల్లాహ్ ప్రసన్నతను బడయటానికి, ప్రజల అప్రసన్నతను ఎదుర్కొనడం సబబే." కాని దానికి భిన్నమైనస్థితి ఏమంటే మనిషి ప్రజలను సంతోషపెట్టడానికి అల్లాహ్‌ను అసంతుష్టపరచడం ఆ తరువాత ఈ సంబంధం అభివృద్ధి చెందుతూ మనిషి ప్రేమ, వైషమ్యాలు, ఏదయినా కేవలం అల్లాహ్ కొరకే కావాలి. దానిలో తన స్వయానికి సంబంధించిన రాగద్వేషాలకు చోటు వుండరాదు. అప్పుడే అతడు అల్లాహ్‌తో తన సంబంధంలో పరిపూర్ణత పొందినాడు అని అర్థం.

"అల్లాహ్ కొరకే ప్రేమించేవాడు, అల్లాహ్ కొరకే ద్వేషించేవాడు, అల్లాహ్

కొరకే ఇచ్చేవాడు మరియు అల్లాహ్ కొరకే (ఇవ్వడాన్ని) వారించేవాడు తన ఈమాన్ (విశ్వాసం) లో పరిపూర్ణత పొందాడు."

మరియు మీరు ప్రతిరాత్రి చేయు 'కునూత్' దుఆలోని ప్రతీ పదం అల్లాహ్‌తో మీకు ఏ సంబంధం వుండాలో ఆ సంబంధాన్నే సూచిస్తుంది. దాని పదాలను గమనించండి. ప్రతి రాత్రీ మీరు అల్లాహ్‌తో ఏ విధమయిన సంబంధం కలిగి వుండాలని ప్రమాణం చేస్తారో చూడండి:

> ఓ ప్రభూ! మేము సహాయం చేయమని నిన్నే అర్థిస్తున్నాము. మార్గం చూపించమని నిన్నే కోరుతున్నాము! క్షమాభిక్ష కొరకు నిన్నే వేడు కొంటున్నాము, నిన్నే విశ్వసిస్తున్నాము. నీపై నే భారం మోపుతున్నాము. సర్వ స్తోత్రములు కేవలం నీ కొరకే ప్రత్యేకిస్తున్నాము. మేము నీకే కృతజ్ఞులమై వున్నాము. మేము నీ అనుగ్రహాలను తిరస్కరించు వారము కాము. నీకు అవిధేయుడైన ప్రతి వ్యక్తిని మేము నిరసిస్తాము. అతనితో విడిపోతాము. ప్రభూ! మేము నీ దాస్యాన్నేచేస్తాము. నమాజ్, సాష్టాంగ ప్రణామం మేము నీ కొరకే చేస్తాము. మా సర్వ యత్నాలు నీకొరకే. మేము నీ కారుణ్యాన్నే ఆశిస్తున్నాము మరియు నీ శిక్షకే భయపడుతున్నాము. తిరస్కారులకు నీ కఠిన శిక్ష లభించడం తథ్యం.

ఇంకా, ఈ "అల్లాహ్‌తో సంబంధం" ఎలా ఉండాలో అనే విషయం మహా ప్రవక్త (సఅసం) రాత్రి తహజ్జుద్ నమాజ్ వేళలో చేసే ప్రార్థనలో కనబడుతుంది. దానిలో మహాప్రవక్త(సఅసం) దేవుని ఉద్దేశించి ఇలా విన్నవిస్తారు:

> "ఓ ప్రభూ! నేను నీకే విధేయుణ్ణి. నిన్నే విశ్వసించాను. నిన్నే నమ్ముకున్నాను. వ్యవహారాలన్నింటి కొరకు నేను నీవైపే మరలాను. నీ నిమిత్తమే నేను పోరాడాను, మరియు పరిష్కారం కొరకు నా సమస్యలను నీ ముందే పెట్టాను."

అల్లాహ్‌తో సంబంధాన్ని పెంపొందించుకునే మార్గం

విశ్వాసి (మోమిన్)కి అల్లాహ్‌తో వుండవలసిన సంబంధం యొక్క సరయిన రూపం ఇదే. ఇప్పుడు ఈ సంబంధాన్ని ఉత్పన్నం చేసి పెంపొందించే మార్గమేదో చూడవలసి ఉంది. దీనిని ఉత్పన్నం చేసే మార్గం ఒక్కటే. మనిషి ఒక్కడు, అద్వితీయుడూ అయిన అల్లాహ్‌ను, తనకు మరియు పూర్తి విశ్వానికి యజమానియనీ, ఆరాధ్యుడనీ, పాలకుడు అని మనఃపూర్వకముగా అంగీకరించాలి. దైవత్వానికి సంబంధించిన సర్వ గుణ గణాలు, హక్కులు, అధికారాలు అల్లాహ్‌కే పరిమితమని ఒప్పుకోవాలి. మరియు తన హృదయాన్ని "షిర్క్" (బహుదైవారాధన) ఛాయలు కూడా సోకకుండా పవిత్రం గావించాలి. ఈ పనిని మనిషి పూర్తిచేసుకున్నప్పుడే అల్లాహ్‌తో అతని సంబంధం ధృవపడుతుంది.

ఇక ఈ సంబంధాన్ని అభివృద్ధి చెయ్యడమనేది రెండు పద్ధతులపై ఆధారపడి వుంది. మొదటి పద్ధతి చింతన, అవగాహన. రెండవది ఆచరణ. చింతన, ఆరాధనా పద్ధతి ద్వారా అల్లాహ్‌తో సంబంధం పెంపొందించుకునే విధమేమంటే మీరు 'దివ్య ఖుర్‌ఆన్' మరియు 'హదీసు'ల (ప్రవక్త ప్రవచనాల) సహాయంతో, ఏ సంబంధాలు మీకూ అల్లాహ్‌కు మధ్య స్వాభావికంగా వున్నవో మరియు క్రియాత్మకంగా ఏవి ఉండవలెనో వాటిని వివరంగా అత్యంత విశదంగా తెలుసుకోవాలి. ఆ సంబంధాల సరియైన భావన, వాటి అవగాహన కలిగి యెదలో అవి వినూత్నంగా ఉండగలందులకు 'ఖుర్‌ఆన్' మరియు 'హదీస్' లను అర్థం చేసుకొని పఠించాలి. వాటిని మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేస్తూవుండాలి. వాటి వెలుగులో మీకు అల్లాహ్‌కు మధ్య ఏఏ సంబంధాలున్నాయో

వాటిని గురించి సావధానంగా ఆలోచించి తమ పరిస్థితిని సమీక్షించుకుంటూ ఉండాలి. వాటిలో ఏఏ సంబంధాల్ని మీరు ఆచరణాత్మకంగా నెలకొల్పారో ఎంత వరకు దాని ఆవశ్యకతలను నెరవేర్చారో, ఏఏ అంశంలో, ఏ లోపముందని గ్రహిస్తారో చూస్తూ వుండాలి. ఈ భావం మరియు దానిపట్ల మెలుకువ ఎంత అభివృద్ధి చెందుతుందో (అల్లాహ్ సంకల్పిస్తే) అంతే ప్రమాణంలో అల్లాహ్‌తో మీ సంబంధం వృద్ధిపొందుతుంది.

ఉదాహరణకు, మీకు అల్లాహ్‌కు మధ్యవున్న ఒక సంబంధం, మీరు దాసులు, ఆయన మీ స్వామి. రెండవ సంబంధం ప్రకారం మీరు పృథ్విపై ఆయన ప్రతినిధి, ఆయన తన అసంఖ్యాకమైన అమానతుల్ని మీకు అప్పగించాడు. మూడవ సంబంధం మీరు ఆయన్ని విశ్వసించి ఆయనతో క్రయ విక్రయ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. దీని ప్రకారం మీరు తమ ధన ప్రాణాలను ఆయనకు విక్రయించారు. ఆయన స్వర్గానికి ప్రతిగా వాటిని కొన్నాడు. ఆయనకు మీకు మధ్యనున్న నాలుగవ సంబంధం: ఆయనముందు జవాబు చెప్పుకొనే బాధ్యత మీపై వుంది. ఆయన మీ లెక్కను మీ బాహ్యరూపాన్ని బట్టి మాత్రమే తీసుకోడు. మీ అన్ని క్రియలు కదలికలేకుండా మీ ఆంతర్యాల్లోని సంకల్పాల రికార్డు కూడా ఆయన వద్ద భద్రపర్చబడుతోంది. ఇలాంటివి ఇంకా పెక్కు సంబంధాలు మీకూ, దేవునికీ మధ్య వున్నవి. ఈ సంబంధాలను అవగాహన చేసుకోవడం, గ్రహించడం, జ్ఞాపకముంచుకోవడం, వీటి అవసరాలను తీర్చటంపై అల్లాహ్‌తో మీ సంబంధం పెంపొందడం, ఆయనకు మీరు అత్యంత సన్నిహితం కావడం ఆధారపడి వున్నాయి. ఈ సంబంధాల పట్ల మీరు ఎంత నిర్లక్ష్యం చేస్తే అల్లాహ్‌తో మీ సంబంధం అంతే బలహీనమౌతుంది. వాటి పట్ల మీరు ఎంత అప్రమత్తత, ఆసక్తి కలిగి వుంటారో అల్లాహ్‌తో మీ సంబంధం అంతే పటిష్ఠం అవుతుంది.

కానీ, ఈ చింతనా పద్ధతి ఫలప్రదం కావాలంటే, అది ఎక్కువ కాలం మనగలగాలంటే దానికి ఆచరణా పద్ధతి ద్వారా సహాయ సహకారాలు ఇతోధికంగా లభించాలి. దైవాజ్ఞలను చిత్తశుద్ధితో పాటించడం, ఏ కార్యములో అల్లాహ్ ప్రసన్నత వున్నదని తెలుస్తున్నదో అట్టి ప్రతి కార్యం కొరకు తీవ్ర కృషి సలపాలి. అల్లాహ్ ఆజ్ఞలను చిత్తశుద్ధితో పాటించడం అంటే అల్లాహ్ ఏఏ పనులను చేయమని ఆజ్ఞాపించాడో వానిని అయిష్టతతో కాక హృదయపూర్వకంగా సమధికోత్సాహంతో చాటుగాను బహిరంగముగాను నెరవేర్చాలి.

దానియందు ఏ లౌకిక ప్రయోజనానికి స్థానమీయక కేవలం అల్లాహ్ అభీష్టాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఏఏ పనులను అల్లాహ్ నిషేధించాడో వాటిని మనఃపూర్వకముగా ద్వేషిస్తూ చాటుగాను, బహిరంగంగాను త్యజించాలి. ఈ అయిష్టతకు మూలము ప్రాపంచిక నష్టభీతికాకుండా, దైవాగ్రహ భీతి అయి వుండాలి. ఈ వైఖరి మిమ్మల్ని 'తఖ్వా' (దేవునికి అయిష్టమయిన కార్యాలతో భీతిల్లుట, వాటిని చేయకుండుట) స్థానాన్ని ప్రసాదిస్తుంది. దీని తరువాత మిమ్మల్ని 'ఏహసాన్' దశకు తీసుకువెళ్లే రెండవ కార్యం ఏమిటంటే ప్రపంచంలో అల్లాహ్‌కు నచ్చిన ప్రతి మంచికార్యాన్ని వ్యాపింపచేయడానికి యత్నించాలి.

అలాగే అల్లాహ్‌కు అయిష్టమయిన ప్రతి చెడును అణచడానికి కృషి చేయాలి. ఈ యత్నంలో ధన, ప్రాణాలను, శ్రమ సమయాన్ని, మనోమస్తిష్కాల యోగ్యతలన్నింటినీ త్యాగం చెయ్యడంలో ఏమాత్రం వెనుదీయరాదు. మరియు ఈ మార్గంలో మీరు ఏ త్యాగం చేసినా దానిపై హృదయంలో ఇసుమంతయినా గర్వపడరాదు. ఇతరులకు ఏదో ఉపకారం చేశాననే భావం కూడా మీ మనస్సులో కలగరాదు. పెద్ద పెద్ద త్యాగాలు చేసి కూడా మన సృష్టికర్త హక్కును నెరవేర్చలేక పోయామనే మీరు భావించాలి.

అల్లాహ్‌తో సంబంధం – దాని పురోభివృద్ధికి సాధనాలు

ఈ నడతను అలవరచుకోవడం అంత తేలిక కాదు. ఇది ఒక అత్యంత కష్టభూయిష్టమైన పర్వతమార్గం. దానిని అధిరోహించడానికి ఎంతో శక్తి అవసరం. ఈ శక్తి మనిషిలో ఉత్పన్నం కావడానికి అవసరమైన సాధనాలు ఇవిః

నమాజ్

ఫర్జ్, సున్నత్ నమాజ్‌లే కాక శక్తికొలది నఫిల్ నమాజ్‌లు కూడా చేయాలి. అల్లాహ్‌తో మీ వ్యక్తిగత సంబంధం పెంపొందడానికి, మీలో చిత్తశుద్ధి కలగటానికి నఫిల్ నమాజ్‌లను గోప్యంగా చేయాలి. నఫిల్ నమాజ్ ముఖ్యంగా తహజ్జుద్ నమాజ్‌లు బహిరంగపరచటం ఒక్కొక్కపుడు ప్రదర్శనా బుద్ధికి అతిశయానికి కారణభూతం అవుతుంది. అది విశ్వాసి (మోమిన్)కి వినాశకరమౌతుంది. ఈ విధమైన నష్టములే ఇతర నఫిల్ కార్యాల, దానధర్మాల దైవ నామ సంస్మరణాలలో గోచరిస్తాయి.

దైవనామ సంస్మరణ

దైవనామ సంస్మరణ జీవన సర్వావస్థలలో సాగుతూ ఉండాలి. దీనికి "సూఫీ"ల వివిధ వర్గాల స్వయం నిర్మిత పద్ధతులు లేక ఇతరులతో గ్రహించిన పద్ధతులు సరియైనవి కావు. ఇందుకు, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు అవలంబించి, తన సహచరులకు బోధించిన మార్గాలే ఉత్తమమైనవి, శ్రేష్ఠమైనవి. మీరు మహాప్రవక్త (సఅసం) నేర్పిన సంస్మరణ సూక్తులు ఎన్ని జ్ఞాపకం

చేసుకోగలరో చేయండి. కాని పదములతో పాటు వాని భావమును కూడా గ్రహించండి. భావాన్ని దృష్టిలో ఉంచుకొని వాటిని అప్పుడప్పుడు పఠించండి. అల్లాహ్ ధ్యానాన్ని నిత్యనూతనంగా ఉంచడానికి ఆయనయందే మనస్సు లగ్నపరచడానికి ఇది ఒక అమూల్యమైన సాధనం.

రోజా

రోజా ఫర్జ్‌యే కాకుండా నఫిల్ రోజా కూడా పాటించవలెను. నఫిల్ రోజాలకు ఉత్తమమైన మధ్యే మార్గము ప్రతీ నెల మూడు దినములు రోజాలు పాటించడం. ఈ దినములలో ప్రత్యేకంగా 'తఖ్వా' స్థితిని పొందడానికి ప్రయత్నం చేయాలి. ఈ 'తఖ్వా'నే 'ఖుర్‌ఆన్ రోజా యొక్క అసలు గుణమని చెబుతోంది.

అల్లాహ్ మార్గములో ధన వినియోగం

అల్లాహ్ మార్గములో శక్తిమేరకు ధనాన్ని ఫర్జ్‌గానే కాదు నఫిల్‌గా కూడా ఖర్చు చేయాలి. ఈ సందర్భములో ఒక విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవడం అత్యంతావసరం. అసలు విషయం మీరు దైవమార్గంలో ఖర్చు చేసే ధన ప్రమాణము కాదు. ముఖ్యమైనది దైవం కోసం మీరు చేసే త్యాగం ఒక బీదవాడు తన కడుపు కట్టుకొని దైవమార్గములో ఒక పైసా ఇచ్చినా అది అల్లాహ్ వద్ద (ఒక ధనవంతుడు) తన భోగ విలాసాలలోని పదవవంతు లేక యిరవయ్యోవంతు త్యాగం చేసి ఇచ్చిన వెయ్యి రూపాయలకంటే మిక్కిలి విలువయినది. ఆత్మశుద్ధికి అల్లాహ్ ఆయన ప్రవక్త చూపించిన మార్గాల్లో

'సద్ఖా' (దానం) అత్యంత ప్రధానమయినదని మీకు తెలియాలి. మీరు దీని ఫలితాలను అనుభవపూర్వకంగా ఈ విధంగా గమనించవచ్చును. ఒకవేళ మీరు ఏదయినా పొరపాటుపని చేసినప్పుడు దానికి మీరు సిగ్గుపడి పశ్చాత్తాపపడండి. రెండవసారి ఏ పొరపాటు జరిగినా పశ్చాత్తాపముతో పాటు మీరు దైవ మార్గములో కొంత దానము కూడా చెయ్యండి. ఈ రెండు సందర్భాలను మీరు పోల్చి చూడండి, పశ్చాత్తాపముతో పాటు దానము చేయడం మనిషి ఆంతర్యాన్ని పరిశుద్ధ పరచి నీచ ప్రవృత్తులను ఎదుర్కొనడానికి ఎక్కువ బలము చేకూర్చగలదని స్వయముగా మీరే గ్రహిస్తారు. ఖుర్ఆన్ మరియు సున్నత్(ప్రవక్త సంప్రదాయం) మనకు చూపిన సామాన్యమయిన పద్ధతి ఇది. మీరు దీనిని ఆచరించిన యెడల సాధనాలు(ముజాహెదా) మరియు తపోనిష్టలు లేకుండానే ఇంట్లో తమ భార్యాపిల్లల మధ్య ఉండి, తమ ప్రాపంచిక వ్యవహారా లన్నింటిని నిర్వహిస్తూనే దేవునితో సంబంధం పెంపొందించు కోగలరు.

అల్లాహ్‌తో సంబంధం – దాని కొలమానం

తరువాత అల్లాహ్‌తో మనసంబంధం ఎంతవుంది? అది వృద్ధి చెందుతున్నదా, లేక క్షీణిస్తున్నదా? అనే విషయాన్ని ఎలా తెలుసుకోవాలి అన్న ప్రశ్న మిగిలిపోతుంది. దీన్ని తెలిసికొనడానికై మీరు స్వప్నంలోని శుభవార్తలకై, మహిమలకై, మహత్యాల ప్రదర్శనలకై చీకటి గదిలో దివ్యకాంతుల దర్శనంకై నిరీక్షించే అవసరం లేదని నేనంటాను. ఈ సంబంధం కొలమానాన్ని దేవుడు ప్రతీ మనిషి హృదయంలోనే పెట్టాడు. మీరు జాగ్రదావస్థలో, పట్టపగలు, అన్నివేళలా దానిని కొలిచి చూడవచ్చు. మీ జీవితాన్ని, మీ వ్యాపకాలను, మీ కృషిని, మనోభావాలను పరిశీలించుకోండి – అల్లాహ్‌ను

విశ్వసించి మీరు ఆయనతో చేసుకొన్న క్రయ విక్రయాల ఒప్పందాన్ని ఎంత వరకు ఆదరిస్తున్నారో! అల్లాహ్ అమానతుల వ్యయం విషయంలో మీరు విశ్వసనీయంగా వ్యవహరించారా? లేక ఏదన్నా విశ్వాస ఘాతుకం జరిగిందా? మీ కార్యకలాపాలు, శ్రమలు, యోగ్యతలు, వస్తు సామగ్రులలో ఎంత భాగము దేవుని కార్యాలలో మరియు ఎంత ఇతర మార్గాలలో వినియోగింపబడుతోంది? మీ స్వప్రయోజనాలకు, మీ భావాలకు భంగం కలిగితే మీ కోపతాపాలస్థితి ఎలా ఉంటుందో దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరుగుతున్నప్పుడు దానిని చూసి మీలో కలిగే హృదయావేదనా, క్రోధమూ, ఆందోళనల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా పరీక్షించుకోండి. ఇలాంటి మరెన్నో ప్రశ్నలను మీరు మీ మనసుతో స్వయంగా అడిగి, దాని జవాబు పొంది దేవునితో మీకు సంబంధముందో లేదో, ఉంటే ఎంత ఉంది? అది తరుగుతోందా, లేక పెరుగుతోందా అనే విషయం ప్రతీనిత్యం గ్రహించవచ్చు. ఇక మీరు స్వప్నంలో శుభవార్తలు అద్భుతాలు, మహిమలు, దివ్య లీలాకాంతుల విషయాల విచారంలో పడిపోకండి. యదార్ధ విషయమేమంటే, మనస్సును మభ్యపరచే పదార్థాలలో కూరుకున్న ఈ భౌతిక ప్రపంచంలో వుంటూ దేవుని ఏకత్వాన్ని కనుగొనుటకంటే మహాద్భుత విషయం వేరొకటిలేదు. షైతాన్ మరియు అతని సంతానం కలిగించే భయాందోళనలకు, లోభాలకు లొంగిపోకుండా ఋజుమార్గంపై ఉండటంకంటే వేరే మహిమలేదు. కుఫ్ర్ (ధర్మ నిరాకరణ), దుర్మార్గము, దుష్టత్వముల గాఢాంధకారములో సత్యజ్యోతిని చూచి దానిని అనుసరించుటకంటే గొప్ప దివ్య దర్శనము వేరొకటిలేదు. మరియు విశ్వాసి (మోమిన్)కి అల్లాహ్‌ను ప్రభువుగా నమ్మి ఆ నమ్మకంపై నిశ్చల మనస్సుతో వుంటూ స్థిరంగా ఆ మార్గంపైనే ముందుకు పోవటం వల్లనే శుభవార్త లభిస్తుంది.

ఆఖిరత్ (పరలోకం)

పరలోకం

'అల్లాహ్‌తో సంబంధం' తరువాత మీకు నేను చేసే రెండవ హితవు సర్వావస్థల్లో ఇహంకంటే పరానికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వండి. మీ ప్రతి కార్యంలో పరలోక సాఫల్యమే లక్ష్యంగా వుండాలి. శాశ్వతమయిన జీవితం పరలోక జీవితమే అనీ, తాత్కాలికమయిన ఈ ప్రపంచ నివాసానికి మనము కేవలం పరీక్షార్థం పంపబడినామని! అదీ దేవుడిచ్చిన బహుతక్కువ సామగ్రీ, కొద్దిపాటి అధికారాలు, వ్యవధులు, అవకాశాలతో పని చేసి మనలో ఎవరు దేవుని స్వర్గంలో శాశ్వతప్రవేశానికి అర్హులో నిరూపించుకోవాలని 'దివ్య ఖుర్ఆన్ బోధిస్తోంది. ఇక్కడ మన్ఖం పరీక్షింపబడే విషయం పరిశ్రమల్లో, వ్యాపారాల్లో, పాడిపంటల్లో, ప్రభుత్వపాలనా వ్యవహారాల్లో ఎంత నైపుణ్యం చూపిస్తున్నా మన్నదో లేక భవనాలు రోడ్లు ఎంత బాగుగా నిర్మిస్తున్నామో లేక వైభవో పేతమయిన సంస్కృతిని సృష్టించడంలో ఎంత విజయాన్ని సాధించామో అన్నది కాదు. పరీక్ష అంతా దేన్ని గురించి అంటే దైవం అనుగ్రహించిన విషయంలో దేవుని ప్రతినిధులుగా మన విధి నిర్వహణలో ఎంత యోగ్యత కలిగి వున్నాము? తిరుగుబాటుదారుగా సర్వ స్వతంత్రుడుగా వుంటున్నామా? లేక దాసునిగా విధేయునిగా వుంటున్నామా? దేవుని భూమిపై దైవాభీష్టాన్ని నెరవేరుస్తున్నామా? లేక స్వాభీష్టాన్ని మరియు అన్య ప్రభువుల అభీష్టాన్ని నెరవేరుస్తున్నామా? దేవుని లోకాన్ని ఆయన ఉపదేశాల కనుగుణంగా తీర్చి దిద్దుతున్నామా? లేక విచ్ఛిన్నం గావిస్తున్నామా? మరియు దేవుని కొరకై

షైతాన్ శక్తులతో నిరంతర పోరాటం గావిస్తున్నామా? లేక వాటిముందు తలవొగ్గుతున్నామా? స్వర్గంలో ఆదం, హవ్వా (అ.స)ల యొక్క ప్రథమ పరీక్ష అసలు ఈ విషయంలోనే జరిగింది.

పరలోకమందు శాశ్వత ప్రవేశానికి మానవాళిలోని వ్యక్తుల ఎన్నిక కూడా ఈ నిర్ణయాత్మకమయిన విషయంపైనే జరుగుతుంది. పరీక్షా సమయంలో ఎవరు రాజ్యపీఠాన్ని అలంకరించి పరీక్ష ఇచ్చారు? ఎవరు బలిపీఠాన్ని అధిష్టించారు? ఎవరికి మహాసామ్రాజ్యమిచ్చి పరీక్షించడం జరిగింది? ఎవరికి పూరిల్లు ఇవ్వబడినది? ఈ పరీక్షా రంగములో తాత్కాలిక పరిస్థితులు అనుకూలంగా వున్నయెడల ఇది సఫలతకు తార్కాణం కాజాలదు. ఒకవేళ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అది నిష్ఫలత కాజాలదు. పరీక్షా రంగమయిన ఈ ప్రపంచంలో మనకు ఏ స్థానం లభించినా, ఏమి ఇచ్చి మనం పరీక్షింపబడినా, పరీక్షలో మనం దైవానికి విశ్వాస పాత్రులయిన దాసులుగా ఆయన అభీష్టాలను నెరవేర్చేవారుగా నిరూపించుకొని, తద్వారా పరలోకంలో దేవుడు తన విశ్వాసపాత్రులయిన దాసులకు ప్రత్యేకించిన స్థానాన్ని పొందగలిగాలి. వాస్తవ సాఫల్యం ఇదే. దీనిపైనే మనదృష్టి కేంద్రీకరింపబడాలి.

మహాశయులారా? ఇది అసలు యదార్థం. దీన్ని గ్రహించి ఒప్పుకోవడంతో సరిపోదు. దీనిని మస్తిష్కంలో నిత్యం తాజాగా వుంచుకోడానికి తీవ్రకృషి చేయవలసి వుంటుంది. లేకపోతే మనం పరలోకాన్ని తిరస్కరించిన వారము కాకపోయినా పరలోకాన్ని మరచి ఇహలోకాన్నే లక్ష్యంగా పెట్టుకొని జీవించే వారి పద్ధతిని అనుసరించే ప్రమాదం వుంది. దీనికి కారణము పరలోకం ఊహకందని విషయం కావడమే! అది మరణానంతరం ప్రత్యక్షమవుతుంది. ఈ ప్రపంచంలో దానిని, దాని మంచి చెడుల ఫలితాల అవగాహనను కేవలం మేధాశక్తితోనే గ్రహించగలము, దీనికి విరుద్ధంగా ఇహలోకం ఒక అనుభవయుక్తమైన

వస్తువు. అది తన కమ్మదనాన్నీ, వెగటును ఎల్లప్పుడూ మనకు చవిచూపుతూ వుంటుంది. దాని మంచి చెడుల ఫలితాలు అనుక్షణం ముందుకువచ్చి ఇదే అసలు ఫలితాలనే భ్రమ కలుగజేసి మనలను ఆత్మవంచనకు గురిచేస్తుంది, పరలోక జీవితం నష్టపడితే దాని బాధ మన అంతరాత్మ మాత్రమే అనుభవిస్తుంది. అది కూడా జీవించి వుంటేనే కాని ఐహికంగా ఏమాత్రం నష్టపోయినా దాని బాధ మన అణువణువూ అనుభవిస్తుంది. మన భార్యా బిడ్డలు, బంధు మిత్రులు, చుట్టాలు, పరిచయస్తులు మరియు సమాజంలోని సామాన్య ప్రజలు అందరు కలిసి దాన్ని అనుభవిస్తారు, అనుభవింపజేస్తారు. అలాగే పరలోకం సఫలమయితే దాని మధురానుభూతి మన ఆంతర్యంలోని మారుమూలల్లో కలుగుతుందే తప్ప పూర్తిగా అనుభవంలోకి రాదు. అది కూడా అశ్రద్ధ వల్ల అది చైతన్య రహితం కాకపోతేనే! కానీ మన ఇహలోకం విజయవంతమయితే మన అణువణువూ పులకించిపోతుంది. మన జ్ఞానేంద్రియాలన్నీ దానిని అనుభవిస్తాయి. మన పరిసరాలన్నీ ఆ అనుభవంలో మనకు తోడ్పడతాయి. ఈ కారణం చేతనే పరలోకాన్ని ఒక విశ్వాసంగా నమ్మడం గొప్ప కష్టం కాకపోవచ్చు. కానీ దీనిని ఆలోచనా రీతికీ నైతికతకూ ఆచరణ వ్యవస్థ మొత్తానికి ప్రాతిపదికగా చేసి జీవితాంతం సాగనివ్వడం ఎంతో కష్టభూయిష్ట మయినది. ప్రపంచాన్ని తుచ్ఛమని నోటితో అనడం సులభం కావచ్చు, కానీ మనస్సునుండి దాని మోహాన్ని, మస్తిష్కం నుండి దాని కోరికను తీసి పారవేయడం అంత తేలికైన పనికాదు. ఈ దశ గొప్ప కృషి ద్వారా ప్రాప్తిస్తుంది. మరియు సదా ప్రయత్నం చేయటం వల్ల మనగలుగుతుంది.

పరలోక చింతన – శిక్షణా మార్గాలు

ఆ ప్రయత్నాన్ని మేమెలా చేయాలి? అనీ, ఆ ప్రయత్నములో ఏ విషయాలు సహాయకారి అవుతాయని మీరు అడగగలరు – దీనికి రెండు మార్గాలున్నాయి.

(1) ఆలోచన (2) ఆచరణ

(1) ఆలోచనా మార్గ మేమంటే మీరు కేవలం, **ఆమన్తుబిల్ యౌమిల్ ఆఖిర్** (పరలోకాన్ని విశ్వసించాను) అనడంతో తృప్తిపడక పవిత్ర ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకొంటూ అధ్యయనం చేయటం అలవరచుకోవాలి, తద్వారా క్రమేణ పరలోకం ఈ ప్రపంచపు తెర వెనుక విశ్వాస పూర్వకంగా కానవస్తుంది. ఏదో ఒక రీతిలో పరలోక ప్రస్తావన లేని ఒక్క పేజీ కూడా పవిత్ర ఖుర్‌ఆన్‌లో బహుశః లేదు. ఒకరు స్వయంగా తమ కళ్ళతో చూచి వివరిస్తున్నట్లు పరలోక దృశ్యాల వర్ణన మీకు పలుచోట్ల కానవస్తుంది. ఇంక పెక్కు చోట్ల, కొంత కాలం వరకు ఆ లోకంలోనే వున్నట్లు అనుభూతి పొందేలా మహాద్భుతంగా ఈ అభివర్ణన చెయ్యబడింది. ఈ భౌతిక ప్రపంచం అనే తెర కాస్త తొలగిపోయిందంటే చాలు. పదాలలో కనిపించేదంతా మనిషి స్వయంగా తన కళ్ళతో చూడగలుగుతాడు. కావున ఖుర్‌ఆన్‌ను నియమం తప్పకుండా అర్థం చేసుకొంటూ పారాయణం చేయటం వల్ల క్రమంగా మనిషి మనస్సులో పరలోక చింతన స్థానమేర్పరచుకుంటుంది; అతడు అన్ని వేళలా తన శాశ్వత నివాసం పరలోకం అని భావించి దానికొరకు ఇహలోక తాత్కాలిక జీవితంలో అతడు తగు సన్నాహాలు చేసుకోగలుగుతాడు.

ఈ మనోస్థితికి హదీస్ అధ్యయనం మరింత శక్తిని చేకూర్చుతుంది. హదీస్‌లో మరణానంతర జీవిత విశేషాలు కళ్ళకు కట్టినట్లుగా ముందుకు వస్తాయి. మరియు మహా ప్రవక్త (సఅసం) సహచరులు పరలోకం పట్ల ఎంత గాఢ విశ్వాసం కలిగి ఉండేవారో విదితమవుతుంది.

ఇంకా ఈ స్థితి సుస్థాపితం కావటానికి సమాధుల దర్శనం దోహద పడుతుంది. మనిషికి నిత్యం తన మరణం జ్ఞాపకముండుట, ప్రపంచ వ్యామోహం లోపడి, మైమరపింపజేసే ఇక్కడి అనుభవాల్లో నిమగ్నుడై అందరూ పోయేచోట

అనుదినం పోతూ ఉన్న చోట తానూ పోవలసి ఉందనే విషయం మరవకుండటమే సమాధుల సందర్శనం యొక్క ఏకైక ఉద్దేశ్యం అని మహా ప్రవక్త (సఅసం) తెలిపారు. అయితే ఒక్క విషయంలో జాగ్రత్త పడాలి.

నేడు మూఢ జనులు తమ కోరికల్ని నెరవేర్చుకోడానికి, కష్టాలను తీర్చుకొనేందుకు కేంద్రాలుగా రూపొందించుకొన్న సమాధులు ఈ ఉద్దేశ్యానికి అత్యంత స్వల్పంగా ఉపయోగపడతాయని గుర్తుంచుకోవాలి. వాటికి బదులుగా సాధారణ గోరీలను దర్శిస్తే అధికంగా ప్రయోజనం పొందవచ్చు. లేక దర్శనం చేసుకొనే నియమ నిబంధనాలు నేర్పి మరీ పంపే దర్వానులు కాపలా దారులు లేని పాదుషాల మహోన్నత సమాధుల్ని సందర్శించి ప్రయోజనం పొందవచ్చును.

ఇక ఆచరణ మార్గమును తీసుకోండి. మీరు ఈ ప్రపంచంలో జీవిస్తూ తమ గృహస్థ జీవనంలో, తమ ఇరుగు పొరుగు వారితో కలసి జీవించడంలో, తమ మిత్రులతో, పరిచయ బృందంతో చేసే వ్యవహారాల్లో తమ నగర, దేశ వ్యవహార విషయాల్లో, ఇచ్చి పుచ్చుకోవటాల్లో, తమ ఉపాధి విషయాల్లో ఒకటేమిటి సర్వరంగాలలో అనుక్షణం అడుగడుగున రెండు మార్గాలు అగుపడుతాయి. వాటిలో ఒకే మార్గాన్ని అనుసరించడం పరలోకం పట్ల విశ్వాసానికి గీటురాయి; రెండవ మార్గాన్ని అవలంబించడం ప్రపంచ వ్యామోహానికి ప్రతీక. ఇలాంటి ప్రతీ సందర్భంలో మొదటి మార్గాన్ని అనుసరించేందుకు ప్రయత్నం చేయండి. మానసిక బలహీనత వలనగాని లేక అజాగ్రత్త వలనగాని రెండవ మార్గంపై ఎంత దూరం పోయినా మేల్కొన్న వెంటనే వెనుదిరగడానికి ప్రయత్నించండి. ఎన్నిసార్లు ఐహిక ప్రపంచం మిమ్ములను ఆకర్షించడంలో సఫలీకృతమైందీ, మరెన్నిమార్లు మీరు పరలోకంవైపు మరలడానికి ప్రయత్నం

చేసి విజయం సాధించినదీ అప్పుడప్పుడు బేరీజు వేసుకొని చూడండి. ఈ పరిశీలన స్వయంగా మీలో పరలోకచింతన ఎంత వృద్ధి చెందిందో ఇంకా ఎంత లోపాన్ని మీరు పూర్తి చేయాలో చూపిస్తుంది. ఎంత కొరత వుందని మీరు గ్రహిస్తారో స్వయంగా మీరే దాన్ని పూర్తిచేయడానికి ప్రయత్నం చెయ్యండి. బాహ్య సహాయం కొరకు లౌకిక వాదులను వదలి మీ దృష్టిలో ప్రపంచానికి బదులు పరలోకానికే ప్రాధాన్యత ఇచ్చే సత్పురుషుల సాంగత్యం చేయండి. జ్ఞాపకముంచుకోండి. స్వయంగా మీ ప్రయత్నం లేకుండా ఏ గుణాన్నయినా మీలో క్షీణింప జేయగలిగే లేక పెంపొందించగలిగే లేదా మీలో లేని క్రొత్త గుణాన్ని సృజించగలిగే ఎలాంటి సాధనమూ ఇంత వరకు కనుగొనబడలేదు.

✡ ✡ ✡

అహంభావానికి దూరంగా ఉండటం

అహంభావ ప్రమాదం

మూడవ హితవు మీకు నేను చేసేది ఏమంటే, గడచిన కొన్ని సంవత్సరాల నిరంతర కృషివల్ల మీ వ్యక్తిగత ప్రవర్తనలో, మీ సామూహిక నడవడిలో మరియు జమాఅత్ క్రమశిక్షణలో మీలో పెంపొందిన సంస్కారంపై గర్వాతిశయాలు మీ హృదయంలో జనించరాదు.

మేము పరిణతి సాధించామనీ, ఎలా తయారు కావాలో అలా అయ్యామనీ మేము పొందవలసిన ఉన్నత ప్రమాణం ఇంకేమీ లేదనీ మీరు ఒక్కొక్కరుగా కాని లేక జమాఅత్ రూపంలో గాని అపోహకు మాత్రం గురి కాకండి.

నాకును జమాఅత్ నాయకులకు ఒక్కొక్కప్పుడు ఒక ఉపద్రవాన్ని ఎదుర్కొనవలసి ఉంటుంది. కొంతకాలము నుండి చాలా మంది ప్రజలు జమాఅతె ఇస్లామీ మరియు అది చేపట్టి నడిపే ఉద్యమం యొక్క విలువను తగ్గించడానికి జమాఅత్ కేవలం ఒక రాజకీయ పార్టీయని, సాధారణ రాజకీయ పార్టీలవలె పని చేస్తున్నదని, దానిలో ఆత్మశుద్ధి, ఆధ్యాత్మిక భావము నామమాత్రాన కూడా లేదని, ఇందులో దైవంతో సంబంధం కొరవ అనీ, పరలోక భావనలో లోపం కలదు అనీ, దాని నిర్వాహకులు స్వయంగా గురుహీనులనీ, మఠాలలో ఆశ్రయాలలో లభించే తఖ్వా ఎహ్సాన్‌ల శిక్షణ

వారు పొందలేదనీ వారి అనుచరులకు కూడా ఆ విధమైన శిక్షణ లభించే అవకాశం లేదనీ ప్రచారం చేస్తున్నారు. జమాఅతె ఇస్లామీ కార్యకర్తలలో, దానిలో ఆసక్తి కనబరిచే వారిలో విరక్తి కలిగించాలని వారి ఉద్దేశ్యం. అలా చేస్తే వారు మరలి ఆ మఠాలకే వస్తారు. అక్కడ కుఫ్ర్ ఛాయల్లో ఇస్లాం యొక్క ఏదో ఒక అంశాన్ని సేవించడమే గొప్ప విషయంగా భావించబడుతుంది. అక్కడ ఇస్లాంను ఒక సంపూర్ణ జీవిత విధానంగా నెలకొల్పి దాని ఆధిపత్యాన్ని సుస్థిరం చేసే యోచన ఏకోశానా లేదు. ఎక్కడయినా ఈ ఆలోచన కలిగినా దాన్ని నానా విధాల విపరీతార్థాలతో ఒక ధర్మరహిత యోచనగా ఋజువుపరిచే యత్నం జరిగింది. కుఫ్ర్ మరియు భ్రష్టాచారానికి బదులుగా ఇస్లాంను అన్నిటా ఆధిపత్యం కల వ్యవస్థగా రూపొందించే ఆలోచనను కేవలం ఒక లౌకిక యోచనగా నిందించడం జరిగింది. ఇట్టి పరిస్థితుల్లో మనం మఠాధిపతులు అనుసరించే ఆత్మశుద్ధి విధానానికి మరియు ఇస్లాం ప్రబోధించే ఆత్మశుద్ధి విధానానికి మధ్యనున్న వ్యత్యాసాన్ని తప్పని సరిగా వ్యక్త పరచవలసి వస్తుంది. ఇస్లాం కోరే వాస్తవ తఖ్వా, ఎహసాన్‌లు ఏమిటో చూపవలసి ఉంటుంది. "మతకళానిపుణులు" శిక్షణ ఇచ్చే ప్రస్తుతం చలామణిలో నున్న ఎహసాన్ తఖ్వాలు ఏమిటో కూడా విశదపరచవలసి ఉంటుంది. దానితో పాటు జమాఅతె ఇస్లామీ సంస్కరణా శిక్షణాపద్ధతి మరియు దాని ఫలితాలను విప్పి చెప్పవలసి ఉంటుంది. కారణమేమంటే, జమాఅతె ఇస్లామీ ప్రభావానికి లోనైన వ్యక్తిలో ప్రారంభదశలోనే జనించే ఎహసాన్ తఖ్వాల వాస్తవ స్థితిని, నిజమయిన ఇస్లామీయ ధర్మ చైతన్యం కల వ్యక్తి స్వయంగానే తెలుసుకోగలగాలి. జీవితాంతం ఆత్మ పరిశుద్ధికై ప్రయత్నం చేసేవారిలో, ఇంకా అలాంటి శిక్షణ ఇచ్చే వారిలో కూడా అలాంటి స్థితి కానరాదనే సత్యాన్ని సయితం తెలుసుకోగలగాలి.

మేము ఈ మాటలు గత్యంతరం లేక, మా విమర్శకుల న్యాయ రహితమైన విమర్శల వల్ల చెప్పవలసి వచ్చింది. ఇది స్వీయ రక్షణ కొరకుకాదు, ఇస్లామీయ ఉద్యమాన్ని కాపాడటానికి చెప్పవలసి వచ్చింది. కాని వీటిని పలికేటప్పుడు మేము దేవుని శరణు వేడుకుంటున్నాము. ఈ మాటలు మనలో, మన సహచరులలో, గర్వం అతిశయాలు, మేము పరిణతి సాధించామనే అపోహ జనించకుండా దేవుని వేడుకుంటున్నాము. ఎందుకనగా ఈ అహంభావము (దేవుడు క్షమించుగాక) మనలో పుట్టినయెడల నేటి వరకు మనం సాధించిన దేదో దానిని కూడా పోగొట్టుకుంటాము.

రక్షణోపాయం

ఈ ప్రమాదం నుండి రక్షించుకోడానికి మూడు యదార్థ విషయాలను మీరు గ్రహించి, వాటిని ఎప్పటికీ విస్మరించకూడదని నేను కోరుతున్నాను.

ప్రథమ విషయమేమంటే పరిణతి అనంతమైనది. దాని ఆఖరి హద్దు మన దృష్టికి అగోచరము. నిరంతరం దాని ఉన్నత శిఖరాలను చేరటానికి ప్రబల ప్రయత్నం చేస్తూ ఏ స్థాయిని చేరినప్పటికీ పరిపూర్ణత సాధించాననే అపోహకు లోనవరాదు. మనిషికి ఏ క్షణంలో ఈ అపార్థం కలుగుతుందో అప్పుడే అతని పురోగమనం స్తంభించిపోతుంది. స్థంభించి పోవడమే కాక పతనం ప్రారంభమవుతుంది. ఒక మాట మరవకండి. ఉన్నత స్థానాన్ని చేరటానికే కాదు, పొందిన తరువాత దాన్ని కాపాడుకోవటానికి కూడా నిరంతర కృషి అవసరమయి ఉంటుంది. ఆ కృషి ఆగిపోవడమే తడవుగా పతనావస్థకు లోనవుతాడు. విజ్ఞాని అయిన వ్యక్తి పైకి ఎంత ఎక్కానా అని క్రిందికి తొంగి చూడకూడదు. తాను ఎక్కవలసిన మిగిలియున్న ఉన్నత శిఖరాలు తనకు ఇంకెంత దూరంలో వున్నాయో అని ఎంత సేపటికి చూపు ఉన్నతాల వైపునకే ఉండాలి.

రెండవ విషయమేమంటే ఇస్లాం మన ముందుంచిన మానవత్వ ప్రమాణం మహోన్నతమయినది. దాని ప్రారంభ దశలు కూడా ఇస్లామేతర మతాల, ధర్మాల పరిపూర్ణతా ప్రమాణాల కంటే అత్యున్నతమైనవి. ఇవి యేదో ఊహాజనిత ప్రమాణాలు కావు. ఆచరణాత్మకంగా దైవ ప్రవక్తలలో అగ్రగణ్యు లయిన ప్రవక్త వారి సహచరుల మరియు ముస్లిం సమాజంలోని సత్పురుషుల పవిత్ర జీవితాలు వాటి ఉన్నత శిఖరాలను ప్రదర్శిస్తున్నాయి. ఈ ప్రమాణాన్ని మీరు నిత్యం దృష్టియందుంచుకోవాలి. అది మిమ్మల్ని పరిపూర్ణత సాధించామనే అపోహ నుండి రక్షిస్తుంది. మీ వెనుకబడినతనాన్ని స్ఫురింపజేస్తుంది. ప్రగతి ప్రయత్నాలకు ఎల్లప్పుడు ఎన్నో ఔన్నత్యాలు మీముందుకు తెస్తుంది. జీవితాంతం కృషి చేసినా ఇంకా ఎన్నో ఎత్తయిన శిఖరాలను ఎక్కవలసి వుందనే మీరు భావిస్తూ వుంటారు. మీ చుట్టూ చావుబ్రతుకుల మధ్య పెనుగులాడే రోగులను చూసి మీకున్న కొద్దిపాటి ఆరోగ్యంపై మిడిసిపడకండి. నైతిక ఆధ్యాత్మిక శక్తులు మూర్తీభవించిన యోధులను దృష్టిలో ఉంచుకోండి. ఈనాడు వారి స్థానంలోనే మీరు షైతాన్‌తో పోరాటానికై రంగంలో దిగారు. విశ్వాసి దీన్(ధర్మం) విషయంలో ఎల్లప్పుడు తన కంటే పైవారినే చూడాలి. ఐహిక సంపదల విషయాలలో తన కంటే తక్కువ వారినే చూడాలి. దీని వల్ల ప్రభువు (రబ్) తనకు ప్రసాదించిన దానికి కృతజ్ఞతా భావం జనిస్తుంది. ధనదాహము కొద్దిలోనే తీరిపోతుంది.

సరిగా ఇదే భావాన్ని ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం) ఇలా వెల్లడిచేశారుః

"ఎవరయితే తన ధర్మం విషయంలో తనకంటే అధికుణ్ణి గమనిస్తూ అతన్ని అనుసరిస్తారో మరియు తన ఐహిక విషయాలలో తనకంటే అధముణ్ణి చూస్తూ అల్లాహ్ తనకు ప్రసాదించిన దానిపై ఆయన ఎడల

కృతజ్ఞతా భావం కనబరుస్తాడో అతడు అల్లాహ్ వద్ద కృతజ్ఞుడుగా, సహన శీలుడుగా పేర్కొన బడతాడు. దీనికి విరుద్ధంగా ఎవరయితే తన ధర్మం విషయంలో తనకంటే తక్కువ వారినీ, ఐహిక విషయంలో తనకంటే పై వారినీ, దృష్టినందుంచు కుంటాడో మరియు ఐహిక సంపదల లేమిపై నిస్స్పృహ నిరాశలకు లోనవుతాడో అతణ్ణి అల్లాహ్ సమక్షంలో కృతజ్ఞుడుగానయినా సహన శీలుడుగా నయినా పేర్కొనడం జరగదు."

మూడవ విషయమేమంటే జమాఅత్‌లో ఇప్పటి వరకు ఏ మంచి లక్షణాలు పెంపొందినా మంచివిగా అగుపిస్తున్నాయంటే దానికి అసలు కారణం మన పరిసరాల్లోని చెడు హద్దుమీరి పోవడమే. ఈ గాఢాంధకారంలో ఓ చిన్న దీపాన్ని వెలిగించే భాగ్యానికి మనం నోచుకున్నాము. అది ఎంతో కాంతి మంతంగా కానవస్తుంది. వాస్తవానికి అసలు విషయమేమంటే, ఇస్లాం సూచించే అత్యల్ప ప్రమాణాలను కూడా ముందుంచుకొని మనం మన పరిశీలన చేసుకుంటే అన్ని విధాల మనలో మన జమాఅత్ వ్యవస్థలో దోషాలకు దోషాలే కానవస్తాయి. మనం మన దోషాలను ఒప్పుకున్నా అది కేవలం వినమ్రతను ప్రదర్శించడానికి మాత్రం కాకుండా దాన్ని యదార్థంగా ఒప్పుకోవాలి; ఫలితంగా మనం మన ఒక్కొక్క దోషాన్ని గ్రహించి దానిని దూరం చేసుకోడానికి ప్రయత్నించాలి.

✡ ✡ ✡

పరిసరాల సంస్కరణ

గృహ సంస్కరణ

తరువాత మీరు మీ భార్యాబిడ్డలను సంస్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించవలసిందిగా కూడా హితవు చేస్తున్నాను.

"మీరు మీ ప్రాణాలను మీ భార్యా బిడ్డలను నరకాగ్ని నుండి రక్షించుకోండి."

'దివ్య ఖుర్ఆన్'

భార్యా బిడ్డల ఆహార సదుపాయాల కొరకు మీరు ఎంత తాపత్రయ పడతారో దానికంటే ఎక్కువగా, వారు నరకాగ్నికి ఇంధనము కాకుండా ఉండగలందులకు శ్రద్ధ వహించవలెను. మీరు మీ శక్తి మేరకు వారి పరలోక జీవితాన్ని తీర్చిదిద్దడానికి, వారిని స్వర్గ మార్గాన నడపడానికి ప్రయత్నం చేయాలి. ఆ తరువాత ఒకవేళ, వీరిలో ఎవరయినా స్వయంగా చెడిపోతే (దైవం అలా చేయకుండుగాక) దానికి బాధ్యులు మీరు కారు. ఏది ఏమైనా, వారి పరలోక జీవితం చెడిపోవడంలో మీరు ఏమాత్రం భాగస్వాములు కారాదు. జమాఅత్ అనుయాయులు ఇతరుల సంస్కారానికై పడే ఆరాటం, తమ ఆలుబిడ్డల, కుటుంబీకుల సంస్కరణలో కనబరచడం లేదనే ఫిర్యాదులు తరచుగా నా వద్దకు వస్తున్నాయి. కొందరి విషయంలో అతిశయోక్తియై యుండవచ్చును. వేరువేరుగా ఒక్కొక్క వ్యక్తి స్థితిని పరిశీలించడం కష్టసాధ్యం.

అందుచేత నేను ఈ విషయంలో ఒక సాధారణ హితవును చేస్తాను. లోకంలో మనకు ఆత్మీయులైనవారు శ్రేయస్కర మార్గంపై ఉండటం చూస్తే అదే మన కంటి చలువ, మన ఆకాంక్ష. కాని ఈ కాంక్షతో పాటు తగిన కృషి కూడా ఉండటం అవసరం.

"ఓ మా ప్రభూ! మా భార్యా పిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు, మమ్మల్ని ముత్తఖీల (భయ భక్తులు కలవారి)లో అగ్రగణ్యులుగా చెయ్యి" (దివ్య ఖుర్ఆన్)

ఈ విషయంలో సహచరులు ఒకరి జీవితంలో మరొకరు శ్రద్ధచూపడం అవసరం. తమ సంతానాన్నే కాకుండా తమ సహచరుల సంతానాన్ని తీర్చిదిద్దటంలో ఆసక్తి కనబరచాలి. పిల్లవాడు తన తండ్రి ద్వారా ప్రభావితుడు కాకుండా, తండ్రి స్నేహితుల ప్రభావాన్ని గ్రహించడం కూడా అనేక మార్లు జరుగుతుంది.

పరస్పర సంస్కరణ

మీరు తమ సంస్కరణతోబాటు, పరస్పరం ఒకరి నొకరు కూడా సంస్కరించుకోవలెననీ మీకు నేను హితవు చేస్తున్నాను. మీరందరు దేవుని సద్వచన ఉన్నతికై ఒక జమాఅత్‌గా ఏర్పడినారు. మీరు పరస్పరం సహాయ సహకారాలను అందించుకునేవారుగా ఒకరియెడల మరొకరు సానుభూతి పరులుగా మెలగాలి.

తమ జమాఅత్ మొత్తం మీద ప్రవర్తన, క్రమశిక్షణా విషయంలో పటిష్టంగా వుండకపోతే తమ మహోన్నతాశయంలో మీరు విజయం సాధించలేరని గ్రహించాలి. ఈ భావానికి ఫలితంగా మీరు తమ సంస్కరణలో

ఒకరినొకరు సహాయకులుగా వుండాలి. మీలో ప్రతి ఒక్కరూ పరస్పరం చేయూత నిచ్చుకుంటూ దైవమార్గంలో ముందుకు సాగడానికి సాగించడానికి యత్నం చేయాలి. నేను పడిపోతూ కనిపిస్తే మీరు పరుగెత్తి నాకు చేయూత నివ్వాలి. మీరు తడబడుతూయుంటే నేను ముందుకు వచ్చి ఆదుకోవాలి. నా నడవడికలో ఏదయినా లోపం కనబడితే మీరు దాన్ని సరిదిద్దాలి. మీ నడవడికల్లో దోషాలు వున్నట్లయితే నేను దాన్ని చక్కబరచాలి. ఏ విషయంలో నా శ్రేయం - సాఫల్యాలు ఉన్నాయని మీరు భావిస్తారో దాన్ని నాకు తెలపాలి. ఏ విషయంలో మీ ఇహ పరములు సఫలీకృతమవుతాయని తలుస్తారో దాన్ని మీకు తెలుపుతాను.

భౌతికపరంగా లోకంలో ప్రజలంతా చేరి పరస్పరం ఇచ్చి పుచ్చు కోవడాలు జరపడంమూలాన మొత్తం మీద అందరి సౌఖ్యం వృద్ధిపొందుతుంది. అలాగే నైతిక ఆధ్యాత్మిక జగత్తులోనూ పరస్పర సహకారం లావాదేవీల పద్ధతి పెంపొందినప్పుడు మొత్తం జమాఅత్ మూలధనం పెరుగుతుంది. ఇస్లాంలో సామూహిక సంస్కరణా విధానం ఇదే.

పరస్పర సంస్కరణా విధానం

సరియైన పరస్పర సంస్కరణా విధానమేమంటే, ఒక వ్యక్తిలో మీకేదైనా అభ్యంతరకరమైన విషయం గోచరిస్తే లేక ఎవరి గురించి అయినా మీకు ఏదైనా ఆక్షేపణ ఉంటే అతని విషయంలో మీరు తొందర పడనవసరం లేదు. మొదట దాన్ని బాగుగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించవలెను. తరువాత తీరిక లభించగానే స్వయంగా ఆ వ్యక్తిని కలుసుకొని ఏకాంతంలో అతనితో ఆ విషయం పట్ల సంప్రదించవలెను. అప్పటికీ ప్రయోజనం కనిపించకపోతే మీ

దృష్టిలో ఆ విషయం ముఖ్యమైనదైనచో దాన్ని మీ స్థానిక అమీరె జమాఅత్‌నకు తెలియపరచవలెను. అతను తానే స్వయంగా సంస్కరించుటకు ముందు యత్నించవలెను. తరువాత అవసరమైతే జమాఅత్ సమావేశములో దానిని ప్రవేశ పెట్టవలెను. ఈ మధ్య ఆ విషయాన్ని ఇతరులకు చెప్పుటగాని, దానికి సంబంధించిన వ్యక్తి వెనుక దాన్ని చర్చించడంగాని కచ్చితంగా చాడీలు చెప్పడమే అవుతుంది. ఈ వైఖరిని ఆమూలాగ్రంగా విడనాడాలి. ఇంతే కాకుండా ఇలాంటి విషయాల్లో స్థానిక జమాఅత్ సంస్కరణ ప్రయత్నాలు విఫలమయి కేంద్ర సహాయం అర్థించే అవసరం ఏర్పడనంత వరకు కేంద్రానికి ఈ విషయాన్ని సమర్పించటం సమంజసం కాదు.

సామూహిక విమర్శ—దాని సరియైన మార్గము

తమలో తాము పరస్పర దోషాలపై, బలహీనతలపై విమర్శ జరపడం కూడా సామూహిక సంస్కారమునకు ప్రయోజనకరమైన మార్గము; కానీ ఈ విమర్శ సభామర్యాదల్ని సరియైన హద్దుల్ని పాటించకపోతే అది అత్యంత హానికరంగా పరిణమిస్తుంది. కావున నేను దాని హద్దులు, మర్యాదలు ఏవో వివరంగా చూపించదలచుకున్నాను.

1 అన్నివేళల, అన్ని సమావేశాల్లో విమర్శించడం తగదు. కేవలం ప్రత్యేక సమావేశంలో అమీరె జమాఅత్ ప్రతిపాదనతో లేక అతని అనుమతితో చేయవచ్చును.

2 విమర్శించేవాడు, తాను అల్లాహ్‌ను సాక్షిగా ఎంచి చిత్తశుద్ధితో శ్రేయోభిలాషా భావముతో విమర్శిస్తున్నాడా? లేక దాని ప్రేరణ

స్వార్థభావమా అని స్వయంగా తాను మనస్సును పరిశీలించుకోవాలి మొదటి రూపమయిన ఎడల నిస్సంశయముగా విమర్శించవచ్చును. లేనియెడల నోరు మెదపక స్వయంగా తన మనస్సును ఆ అపవిత్రత నుండి కాపాడుకునే ఆలోచన చేసుకోవలెను.

3 విమర్శా ధోరణి, దాని భాష రెంటి ద్వారా, వినేవారికి మీరు నిజంగా సంస్కరణనే కోరుచున్నారనే భావం ధ్యోతకమవ్వాలి.

4 విమర్శకు ముందు మీ అభ్యంతరానికి సరియైన కారణం ఉందో లేదో నిర్ధారణ చేసుకోవాలి. నిజానిజాలు తెలుసుకోకుండా ఒకరిని దూషించడం పాపము, దాని వల్ల సమాజంలో ఉపద్రవం చెలరేగుతుంది.

5 ఏ వ్యక్తిపై విమర్శ చేయబడుచున్నదో అతను సహనముతో విషయమును వినవలయును; న్యాయబుద్ధితో దానిని పరిశీలించాలి; నిజాన్ని అంగీకరించాలి; నిజం కాని దాన్ని ఆధారాలతో ఖండించివేయాలి. విమర్శను విని కోపోద్రిక్తులగుట అహంభావానికి చిహ్నము.

6 విమర్శ, దానికి ప్రతి విమర్శలపై ఉత్తర ప్రత్యుత్తర పరంపర అంతులేకుండా సాగి శాశ్వత సమస్యగా పరిణమించరాదు. ఇరువైపుల వాదాలు వివిధ రూపాలు విశదం కానంత వరకే సంభాషణ సాగాలి. ఆ తరువాత వ్యవహారం పరిష్కారము కాని యెడల ఇరువురును ప్రశాంత హృదయంతో ఆలోచించుకొనుటకు సంభాషణ విరమించుకోవలెను. నిజంగా దానిని పరిష్కరించడం అత్యవసరమైనచో రెండవ సమావేశంలో మరల దానిని ప్రవేశపెట్టవచ్చును. ఇంతకు మీ జమాఅత్ వ్యవస్థలో భేదాభిప్రాయాల విషయాల్లో తుది నిర్ణయం గైకొనుటకు ఒక హద్దంటూ వుండవలెను. అచ్చట నిర్ణయం గైకొన్న తరువాత వివాదం అంతమైపోవాలి.

ఈ హద్దులను అతిక్రమించకుండా చేయబడే విమర్శ కేవలం లాభదాయకమేకాక జమాఅత్ సంఘ జీవనాన్ని తీర్చిదిద్దుటకు ఆవశ్యకమై యున్నది. అది లేకుండా ఏ పార్టీ అయినా ఎక్కువ కాలం సక్రమ మార్గంలో మనజాలదు. మీ అమీరు అయినను లేక సలహాసంఘం (మజ్లిసే షూరా) అయినను లేక మొత్తం జమాఅత్ అయినను ఆ విమర్శకు ఎవ్వరూ అతీతులు కారు. దానికి నేను జమాఅత్ ఆరోగ్యవంతముగా మనగలగడానికి అనివార్యమని భావిస్తాను. ఏనాడు మన జమాఅత్‌లో దాని ద్వారము మూయబడునో ఆనాడే అది జమాఅత్ విచ్ఛిత్తికి దారితీస్తుందని నాకు గట్టి నమ్మకముంది. అందుచేతనే నేను మొదటి నుండి జమాఅత్ కార్యకలాపాలను, దాని వ్యవస్థను అంతటినీ విమర్శనాత్మక పరిశీలన చేయుటకు ప్రతీ బహిరంగ సమావేశము తరువాత జమాఅత్ సభ్యుల సమావేశాన్ని ప్రత్యేకంగా యీ ఆవశ్యకత కొరకు యేర్పాటు చేస్తూ ఉంటాను.

అలాంటి సమావేశాలలో నాపైనా లేక నేను చేసే పనులపైనా ఎవరికైన ఆక్షేపణ ఉంటే అతను దానిని అందరి సమక్షములో ప్రవేశపెట్టుటకు వీలుగా తొలుత నన్ను నేనే ఆ విమర్శకై ప్రతిపాదించుకుంటాను. విమర్శలవల్ల నా సంస్కరణ అయినా జరగాలి లేక నేనిచ్చే జవాబుతో అతని లేక అతని వలె ఆలోచించే వారి అపార్ధమయినా దూరమవ్వాలి. కాగా అలాంటి ఒక సమావేశము నిన్నటిరాత్రే ఏర్పరచబడినది. దానిలో బాహాటంగా, స్వేచ్ఛగా చేసిన విమర్శనా దృశ్యమును సహచరులందరు తిలకించారు. ఆ విధమైన దృశ్యాల్ని ప్రథమంగా చూచిన కొందరు క్రొత్త సభ్యులకు అది అమిత విచారానికి కారణమైందని తెలుసుకొని నేను ఆశ్చర్యపడ్డాను. వారు దీనిని ఏదృష్టితో చూశారో తెలియదు. దూరదృష్టితో పరికించినట్లయితే వారి హృదయంలో జమాఅత్ పట్ల గౌరవభావం పూర్వం కంటే ఇంకా అధికంగా పెంపొందియుండేది.

భూమిపై జమాఅతె ఇస్లామీ తప్ప మరే పార్టీ ఉందనీ? దేనిలోనైతే మూడు నాలుగు వందల సభ్యుల సమావేశంలో గంటల తరబడి, బాహాటంగా స్వేచ్ఛా విమర్శలు జరిగినా కుర్చీలు ఎగురకుండా తలలు పగులకుండా ఉండటానికి! పైపెచ్చు సమావేశానంతరం ఎవరి హృదయాలూ కలుషితం కాలేదు.

మాట వినుట, విధేయత చూపుట; అధికారం, ఆదేశం, ఈ భావనలను పెంపొందించే ఆవశ్యకత

మాట వినుట, విధేయత చూపుట, క్రమ శిక్షణను పాటించుట అనే భావనలు మీలో తక్కువగా ఉన్నాయనే విషయాన్ని మీకు తెలుపడం అవశ్యమని భావిస్తున్నాను. మన పరిసరాలను చూచుకొంటే మనలో గొప్ప క్రమశిక్షణ ఉందనే మనకు తోస్తుంది. కాని ఒక వైపున మనము ఆవశ్యకమైన ఇస్లాం ప్రమాణమును, రెండవ వైపున మనము చేయవలసివున్న ఈ కఠిన కార్యమును చూస్తూ ఉంటే వాస్తవానికి మన ఈ ప్రస్తుత క్రమశిక్షణ అత్యల్పమని తోచుచున్నది.

మీ సంఖ్యను వ్రేళ్ళమీద లెక్కించవచ్చు. మీరు అతి స్వల్ప సాధన సామగ్రిలో రంగంలోకి దిగారు. మీ కంటే వేల రెట్ల శక్తీ, లక్షల రెట్ల వనరులుకల, దుష్టత్వం అజ్ఞానాలకు వ్యతిరేకంగా నిలబడి ప్రస్తుత జీవన వ్యవస్థ యొక్క రూపాన్నే కాక దాని అంతరంగాన్ని కూడా మార్చివేయాలన్నదే మీ ధ్యేయం. సంఖ్యలో కాని, వనరుల్లో కాని మీకూ వారికీ ఏ విధమైన పొంతన లేదు. వారికి అభిముఖంగా విజయాన్ని ఆశించుటకు క్రమశిక్షణ, నైతికశక్తి తప్ప మరే శక్తి మీ వద్ద ఉందని? మీ విశ్వసనీయత ముద్ర మీ చుట్టు ప్రక్కలపై పడాలి. జమాఅత్ నాయకులు ఎప్పుడు, ఎక్కడా, ఎంత శక్తిని సమీకరించాలని కోరితే ఒకే సైగలో సమకూరేలా మీ వ్యవస్థ క్రమబద్ధంగా ఉండాలి. అప్పుడే మీరు మీ మహత్తరాశయంలో సఫలీకృతులవుతారు.

మాట వినుట, విధేయత చూపుట – షరీఅత్‌లో వీటి స్థానం

ఇస్లాం ప్రకారం ధర్మసంస్థాపనకై కృషి చేసే పార్టీనాయకుల ధర్మ 'బద్ధమయిన' ఆదేశాల పట్ల విధేయత చూపుట వాస్తవానికి అల్లాహ్, ఆయన ప్రవక్తల విధేయతలో ఒక భాగము. ఒక వ్యక్తి దైవ కార్యమనుకొని ఈ కార్యాన్ని చేస్తే, దైవకార్యముకొరకే అతడు ఒకరిని తన అమీర్‌గా (నాయకుడుగా) ఒప్పుకుంటే, మరియు అమీర్ ఇచ్చే ధర్మబద్ధమైన ఆజ్ఞలను ఆచరిస్తే వాస్తవానికి అతడు ఆ నాయకుణ్ణి కాదు, దైవం మరియు ఆయన ప్రవక్తల ఎడల విధేయత పాటిస్తున్నాడు. దేవునితో, ఆయన ధర్మంతో మనిషి సంబంధం ఎంత పటిష్టంగా ఉంటుందో అంతే ఎక్కువగా అతడు మాట వినుట, విధేయత చూపుటలో మున్ముందు ఉంటాడు. ఈ సంబంధంలో ఎంత లోపముంటే మాట వినుట, విధేయత చూపుటలో కూడా అంతే లోపముంటుంది. ఒక వ్యక్తికి మీపై ఎలాంటి అధికారం లేదు. కేవలం దైవ కార్యానికై అతన్ని మీరు అమీర్‌గా ఒప్పుకున్నారు. ఆయన ఆజ్ఞల్ని మీరు ఒక విశ్వసనీయుడయిన అనుచరునిగా పాటించాలి. ఇంకా ఆ ఆజ్ఞలు మీ వాంఛకు, ఇష్టానికి, ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ వాటిని నిండు మనసుతో మీరు శిరసావహిస్తూ ఉండాలి. ఇంతకంటే మహత్తరమైన త్యాగం మరేదీ కాజాలదు. ఈ త్యాగం దేవునికై చేస్తున్నారు కాబట్టి, దీని ప్రతిఫలం కూడా దేవుని వద్ద అమితంగా ఉంటుంది. దీనికి భిన్నంగా - ఏ వ్యక్తి ఈ కార్యంలో పాల్గొని కూడా, ఏ పరిస్థితిలోనూ ఒకరికి లోబడి ఉండుటకు ఇష్టపడడో, విధేయత తన హోదా కంటే అల్పమయిన విషయం అని తలుస్తాడో, లేక ఆజ్ఞను తన అహానికి విఘాతంగా భావిస్తాడో, బాధతో మధన పడతాడో తన అభీష్టానికి స్వప్రయోజనానికి వ్యతిరేకమయిన ఆజ్ఞల్ని పాలించుటకు

వెనుదీస్తాడో, అసలు అతడు తన మనస్సును అల్లాహ్ విధేయతకు అర్పించుకోలేదని, ఇంకా అతని అహం తన ప్రాబల్యాన్ని వదలుకోలేదనీ నిరూపిస్తాడు.

పార్టీ నాయకుల వైఖరి ఎలా ఉండాలి?

జమాఅత్ సభ్యులకు ఆజ్ఞాపాలన చెయ్యమని చేసిన హితవుతో పాటు, జమాఅత్ నాయకులకు కూడా హితవు చేయడం అవసరం అని భావిస్తున్నాను. వారు ఆజ్ఞాపించే సరియైన పద్ధతి అలవరచుకోవాలి. ఏ వ్యక్తికైనా జమాఅత్ వ్యవస్థలో ఒక బాధ్యతాయుతమయిన హోదా అప్పగించి కొంతమందిని అతని అధీనం చేసినప్పుడు అతడు తనకు తాను గొప్పవాణ్ణి అయ్యానని భావించుట, తన ఆధీనంలో నున్న సహచరులపై సందర్భ రహితంగా తన ఆజ్ఞల్ని చలాయించడానికి ప్రయత్నించుట ధర్మం కాదు. ఆజ్ఞల్ని చలాయించటంలో అతిశయానందం పొందకూడదు. అతడు తన సహచరుల ఎడల మృదువుగా ఎంతో వాత్సల్యంతో మెలగాలి. తన పొరపాట్లవల్ల సభ్యులలో విధేయతలేమి, తలబిరుసుతనం తల ఎత్తకుండా అతను జాగ్రత్తపడాలి. యువకుల్ని, వృద్ధుల్ని, బలహీనుల్ని, బలవంతుల్ని, కలవారినీ, లేనివారినీ, ఒకే గాటన కట్టివేయరాదు. జమాఅత్ కార్యకర్తల ప్రత్యేక వ్యక్తిగత పరిస్థితులపై అతని దృష్టి ఉండాలి. ఎవరు ఏ సౌకర్యానికి సమంజసంగా అర్హులో వారికి ఆ సౌకర్యాన్ని కలిగించాలి. అమీర్ ఇచ్చే సలహాల్ని, చేసే విజ్ఞాపనల్ని సభ్యులు ఆజ్ఞలుగా భావించి పాటించేలా జమాఅత్‌కు అతడు తర్ఫీదు ఇవ్వాలి. అమీర్ చేసే విజ్ఞప్తి ప్రభావవంతం కాకపోవడం, విధిలేక అతడు ఆజ్ఞ ఇచ్చే అవసరం ఏర్పడడం అంటే సభ్యులకు జమాఅత్ పట్ల సంస్థాగత చైతన్యం లోపించిందన్న మాట. జీత భత్యాలు పుచ్చుకునే సైనికులకే "ఆజ్ఞ" ఇవ్వబడుతుంది. మనఃపూర్వకంగా దైవం కోసం సమావేశమయిన స్వచ్ఛంద సేవకులు,

దైవకార్యం కోసం స్వయంగా తామే ఎన్నుకొన్న అమీర్ యొక్క విధేయతకై ఆజ్ఞ కొరకు వేచి యుండరు. వారికి, ఫలానా చోట, ఫలానా దైవకార్యం చేసే భాగ్యం లభిస్తుందనే సూచన మాత్రంగా తెలిస్తేనే చాలు. ఈ స్థితి జమాఅత్ నాయకులలో జమాఅత్ కార్యకర్తలలో ఏనాడు జనిస్తుందో, ఆనాడు ఇంత వరకు అప్పుడప్పుడు నాయకుల కార్యకర్తల మధ్య ఉత్పన్నమౌతూ వచ్చిన మనస్పర్ధలు వాటంతట అవే అంతమౌతాయి.

అల్లాహ్ మార్గంలో కృషి

ఈ సందర్భంలో నా తుది హితవు ఏమంటే జమాఅతె ఇస్లామీలో ఉన్న వారందరూ అల్లాహ్ మార్గంలో అనర్గళ కృషి చేసే భావన పెంపొందించు కోవాలి. అంటే, ధన ప్రాణాల త్యాగ భావం తమలో వృద్ధి పరచుకోవాలి. దేవుని కార్యానికి తమ స్వంత కార్యాలపై ప్రాముఖ్యత నివ్వాలి. ఈ కార్యం పట్ల వారిలో జనించే దీక్ష వారిని ఎప్పుడూ ప్రశాంతంగా కూర్చోనివ్వకూడదు.

మీరే కాకుండా మీ జేబులను కూడా "ముస్లింలు" చేయాలి. దేవుని హక్కులు మీ శరీరం, ప్రాణం, సమయము మీదనే కాక మీ సంపదపై కూడా ఉన్నాయన్న విషయము మీరు మరువకూడదు. ఈ హక్కుల విషయంలో అల్లాహ్, ఆయన ప్రవక్త కనిష్ట ప్రమాణాలను నిర్ణయించారు. కాని గరిష్ట ప్రమాణాలను నిర్ణయించలేదు. ఈ ప్రమాణాన్ని నిర్ణయించుకొనుట మీ కర్తవ్యం. ఎంత ధనం దైవ మార్గంలో వెచ్చిస్తే మన సంపదపై దైవానికి ఉన్న హక్కును నెరవేర్చామని భావించటం భావ్యమవుతుందో మీరు మీ అంతరంగాన్ని అడగండి. ఈ విషయంలో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని గురించి తీర్పు చేయలేడు. అత్యుత్తమంగా తీర్పుచేయునది ఆ వ్యక్తి అంతరాత్మ మరియు విశ్వాసమే. దైవాన్నీ పరలోకాన్ని విశ్వసించని వారు తమ దృష్టి విధానాల ప్రగతికి

ఎన్నెన్నో త్యాగాలు చేస్తారు. దేవుని, పరలోకాన్ని విశ్వసించే మనం వారిని చూసి సిగ్గుపడవలసి వస్తుంది.

ధర్మ సంస్థాపనా కార్యంలో మన సహచరులు చూపవలసిన నిమగ్నతలో కూడా నాకు కొరత గోచరిస్తున్నది. కొందరు కార్యకర్తలు చురుకుగా పని చేస్తున్నారనడంలో సందేహంలేదు. వారిని చూచి సంతోషం కలుగుతుంది. వారి కొరకు మనసారా ప్రార్థిస్తున్నాను కూడా. కాని పెక్కుమంది నిండు మనసుతో పని చేయడం కానరావడంలేదు. స్వైర విహారం చేస్తున్న దుష్టత్వాన్ని పాపాన్ని, కలుషిత వాతావరణాన్ని, దైవధర్మ నిస్సహాయతనూ చూచి ఒక మోమిన్(విశ్వాసి) హృదయంలో కలుగవలసిన ఆవేదన చాలా కొద్ది మందిలో మాత్రమే అగుపడుతోంది. అనారోగ్యంగా ఉన్న మీ కుమారుణ్ణి చూచి, లేక మీ ఇల్లు కాలిపొయ్యే ప్రమాదం వున్నదని భావించి మీరు ఎంత ఆందోళన చెందుతారో, ఈ వాతావరణాన్ని చూచి మీ మనసు కనీసం అంతయినా కలతచెందాలి. ఎంత నిమగ్నతతో ఎంత చురుకుదనంతో పని చేయాలో ఒకరు నిర్ధారణ చేసి మరొకరికి చెప్పే విషయం కాదిది. ఎంత పనిచేస్తే "సత్యం" నాపై మోపే బరువు బాధ్యతల్ని నేను నెరవేర్చగలుగుతాను అనే విషయాన్ని మీరే మీ మనస్సాక్షిగా నిర్ణయించుకోవాలి. ఇంతకు, 'మిథ్య'ను ఆరాధించే ఏదో ఒక మిథ్యా వ్యవస్థ ఉన్నతికై పాటుపడేవారి కార్యకలాపాలపై వారు దానికొరకు చేసే మహత్తర కృషిపై దృష్టిని సారిస్తే మనకు ఎంతో గుణపాఠం దొరుకుతుంది.

వ్యతిరేకతల సిగ్గుమాలిన అసమంజసత

జమాఅత్‌కు ప్రతికూలంగా కొద్ది కాలము క్రిందనే భారీ ఎత్తున ప్రారంభమైన వ్యతిరేకతలను గురించి క్లుప్తంగా వివరిస్తాను. ఆధారాలతో కూడిన సమంజసమైన విభేదాలను మేము ఎన్నడూ తప్పుగా భావించలేదు.

ఇకపై భావించటం కూడా జరగదు ఇన్షా అల్లాహ్! కాని, వాటి వెనుక సదభిప్రాయం, సత్యాభిలాష ఉండాలి. పరస్పరం మాటను గ్రహించటం లేక గ్రహింప చేయటం వాటి ఉద్దేశ్యమై ఉండాలి. స్వయంగా మేము పలుమార్లు ఇతరులతో భేదాభిప్రాయం వెలిబుచ్చాము. అలాంటప్పుడు ఇతరులు తమ అభిప్రాయ భేదంలో ప్రకటించే హక్కును మేము ఏ విధంగా నిరాకరించగలము? కాని దురదృష్టవశాత్తు ఆ అభిప్రాయ విభేదంలో ఈ విధానమును మా వ్యతిరేకులలో చాల తక్కువమంది అనుసరిస్తున్నారు. వారిలో చాలామంది మనపై అసత్యారోపణలు చేస్తున్నారు, తప్పుడు మాటలను పులుముతున్నారు, మన రచనలలో మార్పులు చేర్పులు చేసి వాటికి తమ ఇష్ట మొచ్చిన అర్థాలను కల్పిస్తున్నారు. ఇవన్నియు మన యొక్క లేక తోటి మానవుల సంస్కరణ కొరకు గాక మనకు వ్యతిరేకంగా జనుల్లో అపనమ్మకాన్ని సృష్టించడానికి, మరియు మనము ఇస్లాం జీవన వ్యవస్థను సమాజంలో స్థాపించుటకు చేసే యత్నములను భంగపర్చడానికి వారిలా అంటున్నారు.

ఈ అసత్యపు తుఫానును రేకెత్తించుటలో వివిధవర్గాలవారు చేరి ఉన్నారు. ఒకవైపు అధికారంలోవున్న కొందరు పార్టీ నాయకులు, పత్రికా విలేఖరులు వున్నారు. వారికి మనదేశంలో ధర్మ సంస్థాపనా వుద్యమం అసలు గిట్టదు. రెండవ వైపు పాశ్చాత్యుల దుష్టత్వం, నాస్తికత్వం, ఉదారత్వాలను బలపరచేవారు ఉన్నారు. వారికి తమ ఆలోచన, ఆచరణల స్వేచ్ఛలపై ఇస్లాం నమ్మకాల నైతిక నియమాల ప్రతిబంధకాలు ఏమాత్రం నచ్చవు. మూడవ వైపు వక్ర మార్గాలు అవలంబించే వివిధ వర్గాలున్నాయి. ఒకవేళ ఇక్కడ నిజమయిన ఇస్లాం జీవన వ్యవస్థ యొక్క పరిచయం, ప్రచారం వాస్తవానికి ముమ్మరంగా జరిగినట్లయితే తమ మార్గ భ్రష్టతలను వ్యాపింప చేయడానికి

వీలుండదనే బలమయిన భయాందోళనలు వారికి ఉన్నాయి. నాల్గవ వైపు కమ్యూనిస్టు మహాశయులున్నారు. వారి మార్గంలో అన్నింటినీ మించిన గొప్ప అవరోధం ఏదైనా ఉంటే అది జమాఅతె ఇస్లామీ అని వారికి బాగా తెలుసు. ఈ వ్యతిరేకతలన్నీ కొంత వరకు స్వాభావికమైనవే అని చెప్పవచ్చు. ఈ వ్యతిరేకతలు లేకపోతేనే ఆశ్చర్యపడవలసిన విషయం. సత్యాన్ని అసత్యంతో అణచివేయడానికి ప్రయత్నించడం వారి ధర్మం ప్రకారం ఏమాత్రం తప్పుకాదు. వారి ఈ వైఖరి మనం ఎదురు చూస్తున్నదే. కాని, మన జమాఅత్ మొత్తాన్ని చాలా బాధ కలిగించిన విషయం ఏమంటే ఈ వ్యతిరేకులలో కొందరు దేవ్‌బంద్ విద్వాంసులు, అహ్లెహదీస్ పండితులు కూడా కనబడుతున్నారు. పైపెచ్చు అసత్యం, అభూత కల్పనలు చేయడంలో ఈ మహాశయులు మార్గభ్రష్టులయిన తమ "మిత్రులను", కూడా మించిపోయారు. ఈ విఘాతం నిజానికి మనకు అత్యంత బాధాకరం – ఈ మహాశయుల బలాబలాలను చూచికాదు, కేవలం వీరిని మనం ధర్మతత్పరులనీ, దైవభక్తులనీ భావిస్తున్నాము. కాబట్టి వీరిని ఆ రూపంలో కూడా చూడవలసి వస్తుందని అసలు అనుమానమయినా కలుగలేదు. వీరు ఇస్లామీయ ఉద్యమంలో అగ్రగాములుగా వుంటారని మనం వారి వెనుక నడవాలనీ ఎంతో ఆశపడినాము. కానీ వీరు, కమ్యూనిష్టులను, హదీసు తిరస్కారులను, ఖాదియానీలను, పాశ్చాత్యమార్గ విహీనతను బలపరిచే వారినీ తమతోపాటు మన విరోధి శ్రేణుల్లో చేర్చి వారితో భుజాలు కలిపి మనపై దాడిచేస్తున్నారు. ఈ 'బొంతల'కు ఆ 'గంతలు' తగునా? అని ఒక్క క్షణంపాటు ఆలోచించి ఉంటే ఎంత బావుండేది!

✡ ✡ ✡

కింకర్తవ్యం?

ఇప్పుడు ఈ విభిన్న దిశల నుండి మనకు జరుగుతున్న వ్యతిరేకతల విషయంలోనూ మన సహచరులకు కొన్ని హితవులు చెయ్యటం అవశ్యకమని భావిస్తున్నాము. ఈ విషయంలో నా ప్రథమ హితవు ఏమంటే మీరు ఏ పరిస్థితులలోను రెచ్చిపోకూడదు. మీ మనస్సును, నోటిని, ఆధీనంలో ఉంచుకోవాలి. ఎప్పుడయిన రెచ్చిపోయే స్థితి ఏర్పడుతున్నట్టు భావిస్తే, షైతాన్ పెడత్రోవన పడవేస్తున్నాడని తలచి దేవుని శరణు వేడుకోండి. యదార్థమేమంటే, ఈ కార్యాన్ని భగ్న పరచడానికి షైతాన్ స్వయంగా తానే యీ పన్నుగడ పన్నుతున్నాడు. వాడు ఒక వైపు మన వ్యతిరేకులను పురిగొల్పుతున్నాడు, వారి చేత అర్థం లేని దాడి మనపై జరిపిస్తున్నాడు. రెండవ వైపు మనము ఆ వ్యతిరేకతకు ఉత్తర ప్రత్యుత్తరాలలో చిక్కుకొని, వారికి ఎంతో అయిష్టమయిన యీ కార్యాన్ని ఏవిధంగానూ కొనసాగించకుండా. మనల్ని వారికి ప్రతికూలంగా పురికొల్పుతున్నాడు. మనము వాని యీ ఎత్తుగడలు పారనివ్వరాదు.

రెండవ హితవు ఏమంటే, కొందరు విద్వాంసులవల్ల, వారి శిష్యులవల్ల మరియు వారి అనుయాయులవల్ల మీకు ఎంత బాధ కలిగినా మీరు దానిని 'బాధ' 'విచారం' వరకే పరిమితం చెయ్యండి. "ద్వేషం"గా పరిణమించ నివ్వకండి. పూర్వం కొందరు చేస్తూ వచ్చిన పొరపాటును చేయకండి. వారుకొందరు విద్వాంసుల అక్రమాలపై కోపగించుకొని విద్వాంసులందరినీ నిందించడం ప్రారంభించారు. వారు ఆ హద్దులో కూడా ఆగక స్వయంగా

ధర్మవిద్యనే తూలనాడడం మొదలెట్టారు. విద్వాంసుల్లో అత్యధికులు దేవుని కృపానుగ్రహమువల్ల, సత్యాన్ని ప్రేమించేవారు, సత్యాన్ని ఆరాధించే వారుగానే ఉన్నారు. వారిలో నుండి మంచి సహచరులు మనకు లభ్యమైనారు. ఇంకా లభ్యమవుతూ ఉన్నారు కూడా. ఈ విషయాన్ని మీరు మరువకూడదు.

మూడవ హితవు ఏమనగా మీరు వ్యతిరేకతను ఎదుర్కొనే కార్యాన్ని నాకు వదలివేయండి. మీ పనిని మీరు చేస్తూ ఉండండి. నేను ఏమేరకు అవసరమని భావిస్తానో వాటిని ఎదుర్కొనే కార్యాన్ని స్వయంగా చేపడతాను, లేక జమాఅత్‌లో బాధ్యతాయుతులయిన వారి ద్వారా చేయిస్తాను. మీ కర్తవ్యం కేవలం ఒక్కటే, అసత్యారోపణ ముందుకు వచ్చినప్పుడు మీరు జమాఅత్ లిటరేచర్‌లో నుండి దాని జవాబును తీసి చూపించండి. తదనంతరం కూడా ఎవరయినా వాదానికి దిగినట్లయితే సలాం చేసి అతన్ని వదలి వేయండి. మార్గాన ముందు నడవదలచిన వారికి సముచితమయిన ఉపాయమేమంటే దారిలో వారి దుస్తులు ఏదయినా ముండ్ల కంపలో చిక్కుకుంటే ఒక్క క్షణం ఆగి దుస్తుల్ని వదలించుకొనడానికి ప్రయత్నించాలి. అది వదలే సూచనలు కనబడనప్పుడు గమనాన్ని పాడు చేసుకోడానికి బదులు దుస్తుల ఆ భాగాన్ని చింపివేసి ఆ భాగాన్ని కంపకు అప్పగించి ముందుకు సాగిపోవాలి.

నాల్గవ హితవు ఏమంటే, కఠినాతి కఠినమయిన, కడుహేయమయిన వ్యతిరేకతకు కూడా జవాబు ఇవ్వడంలో మీరు దైవ నియమాలను ఎన్నటికీ అతిక్రమించకండి. మీనోటి నుండి లేక కలమునుండి వెలువడే ప్రతీమాట సత్యదూరంగా లేదనీ, దానికి దైవం ఎదుట మీరు సంజాయిషీ చెప్పుకోగలరని రూఢి చేసుకొని మరీ పలకండి లేక రాయండి. మీ వ్యతిరేకులు దైవం ఎడల భీతి చెందినా చెందకపోయినా మీరు మాత్రం నిత్యం ఆయన ఎడల భీతి చెందుతూ ఉండాలి.

అయిదవ హితవు ఏమంటే, ఈ వ్యతిరేకత వల్ల మన ఉద్యమం ప్రగతి మార్గాన పురోగమించుటకు అసాధారణమయిన అవకాశం ప్రాప్తమైంది. దీన్ని పూర్తిగా వినియోగించుకోండి. దైవం మన ప్రచారానికిగాను సమకూర్చిన సాధనం ఇది. దీనివల్ల కలతచెందకండి. దీన్ని వినియోగించుకోండి, అరబ్‌లో అదే విధమైన దుష్ప్రచారం తుఫానులా మహా ప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా చెలరేగినప్పుడు అల్లాహ్ ఆయనకు అందచేసిన శుభవార్త ఇదే! మేము మీ కీర్తిని సర్వత్రా వ్యాపింపజేశాము. 20 సంవత్సరాలలో కూడా మన పరిమిత వనరుల ద్వారా మనం చేయగలిగిన ప్రచారాన్ని ఎంతో భారీ ఎత్తున ఇలా ఉచితంగా చెయ్యటంపట్ల మనం కృతజ్ఞతలు చెల్లించుకోవాలి. ఇప్పుడు మిగిలిందేమంటే, ఎక్కడెక్కడ మనల్ని చెడుగా పరిచయం చెయ్యటం జరిగిందో అక్కడల్లాచేరి, మనం మన మంచిని పరిచయం చెయ్యాలి. అల్లాహ్ అభిలషిస్తే ఇది మనకు రెండు విధాలుగా లాభిస్తుంది. ఎవరెవరయితే ఈ అసత్య ప్రచారంలోని యదార్థాన్ని తెలుసుకుంటారో వారు జమాఅతె ఇస్లామీ యొక్క అభిమానులుగా మారటమే కాక, ఎదుటివారు చాటే అబద్ధాన్ని, సత్యం పట్ల ద్వేషాన్ని సరియైన ఆధారాలతో సహా తిలకించినప్పుడు వారిపట్ల ఉన్న విలువ, గౌరవాలు కూడా దూరమవుతాయి. షైతాన్ ఎత్తుగడలను, అందుకే అల్లాహ్ బలహీనమయిన వన్నాడు. షైతాన్ తన అనుచరులకు తాత్కాలికంగా ఎంతో శక్తిమంతమయినవిగా కనబడే ఆయుధాలను సరఫరా చేస్తాడు. కాని అవి తుదకు వాటిని ఉపయోగించే వ్యక్తి గొంతునే కోసివేస్తాయి!

నా తుది హితవు విద్వాంసుల వర్గానికి చెందిన జమాఅత్ అనుయాయుల కొరకు ప్రత్యేకిస్తున్నాను. అదేమంటే, వారిలో ప్రతి వర్గం వారు తమ తమ వర్గానికి చెందిన విద్వాంసులతో సంప్రదించాలి. వారిని ఒక్కొక్కరుగా లేక సామూహికంగా కలుసుకోవాలి, వీలయితే ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరపాలి.

మీరు వారితో కొన్ని ముఖ్య విషయాలు చర్చించాలి. మీరు చేసే ఈ కార్యకలాపాలు (జమాఅత్ పట్ల వ్యతిరేకత) పరిణామం ఏమి కానున్నదో ఆలోచించారా! అంతకు పూర్వం విభిన్న దశలలో మీకును విద్యావంతులయిన నవతరానికి మధ్య చెలరేగిన సంఘర్షణలవల్ల, మీ ప్రతిష్ట అనుదినం పడిపోవటమే కాక ధర్మం యొక్క గౌరవ ప్రతిపత్తులు దెబ్బతిన్నాయి. ఇప్పుడు జమాఅతె ఇస్లామీ, వారిలోని మంచివారిని ఒక్కొక్కరినే ధర్మం వైపునకు మరల్చ గలుగుతోంది. ధార్మికాభిమానం మూలంగా వారు మీకు సన్నిహితులుగా మారుతున్నారు. ఇలాంటి తరుణంలో మీరు ఈ పోరాటాన్ని రేపినారు; అదీ ఎంతో అపసవ్యమయిన ధోరణిలో, దాని పర్యవసానంగా విద్యావంతులేకాక మీ శిష్యగణం కూడా మీమీద ఉన్న విశ్వాసాన్ని కోల్పోయింది. ఈ చేష్టలవల్ల ఏ ప్రయోజనాల్ని మీరు ఆశిస్తున్నారు? మీరు దేవుని సమక్షంలో దీనికి జవాబు చెప్పుకోవలసి ఉందనీ, దీని పరిణామం ఏమవుతుందోననీ ఆలోచించుకున్నారా! ఒకవేళ కొన్ని విషయాలలో జమాఅత్‌తో మీకు అభిప్రాయ భేదాలున్నా, దాన్ని సంప్రదింపుల ద్వారా లేక శాస్త్రీయ చర్చల ద్వారా పరిష్కరించడానికి వీలులేకపోయిందా? జమాఅత్‌కు వ్యతిరేకంగా "ఫత్వాలు" జారీ చేయడం, ప్రకటనలు చేయించడం, కరపత్రాలను అచ్చు వేయడం తప్ప గత్యంతరం లేకపోయిందా? సరే ఇదంతా అవసరమే అనుకుంటే, మీ నిందలను, ఆక్షేపణలను నిరాధారమయినవిగా, ఊహాజనితమయినవిగా ఋజువు చేసినప్పటికీ మీరు తమ ఆక్షేపణలనే మాటి, మాటికీ ఉద్ఘాటిస్తూ ఉంటారా?" అని మన జమాఅత్‌లోని సోదరులు తమ తమ వర్గంలోని పెద్దలతో విస్పష్టంగా చెప్పవలసి ఉంది. వారి అపార్థాలను, అపోహలను దూరం చేయాలి.

✡ ✡ ✡

మహిళలకు హితవులు

ఇప్పటి వరకు నేను చెప్పిన దానిలో చాలా భాగం పురుషులకు, మహిళలకు సమిష్టిగా వర్తించేది, ఇప్పుడు ముఖ్యంగా జమాఅత్‌లో చేరియున్న లేక జమాఅత్ పట్ల ఆసక్తి కలిగి ఉన్న మహిళలతో కొన్ని మాటలు విన్నవించ దలచాను.

(1) మొదటి విషయం ఏమనగా మీరు మీ ధర్మాన్ని గురించి అత్యధికంగా తెలుసుకోవాలి. దివ్య ఖుర్‌ఆన్‌ను అవగాహన చేసుకుంటూ పఠించడమే కాకుండా హదీస్, (మహాప్రవక్త సంప్రదాయం) ఫిఖా (ఇస్లాం చట్టము) లను కూడా అధ్యయనం చెయ్యాలి, ధర్మానికి సంబంధించిన మౌలిక విషయాలను, విశ్వాసం మీపై మోపే బాధ్యతలను మాత్రమే కాక మీ వ్యక్తిగత జీవితం, మీ గృహజీవితం, మీ కుటుంబ జీవితం మరియు సామాజిక జీవితం గురించి ధర్మం ఇచ్చే ఆదేశాలను కూడా తెలుసుకోండి. ముస్లిముల గృహాల్లో షరీఅత్‌కు విరుద్ధమైన పద్ధతులు ఆచరింపబడటానికి అజ్ఞాన కాలపు మూఢ ఆచారాలు చోటుచేసుకోడానికి గల కారణాలలో ముఖ్యమయింది స్త్రీలలో ధర్మ పరిజ్ఞానం లోపించడమే. అన్నిటికంటే ముందు మీరు ఈ లోపాన్ని తీర్చడానికి శ్రద్ధ వహించాలి.

(2) రెండవ కార్య మేమంటే, మీకు ఉన్న ధర్మ జ్ఞానానికి అనుగుణంగా మీరు మీ నిత్య జీవితాన్ని, మీ నైతిక ప్రవర్తనను, నడవడికను మీ గృహ జీవితాన్ని తీర్చి దిద్దుకోవడానికి ప్రయత్నించాలి. ఒక ముస్లిం మహిళ పటిష్టమైన

క్యార్టక్టర్‌ను కలిగి ఉండాలి. ఆమె, తాను ఏ విషయాన్ని సత్యమని గ్రహించిందో దాన్ని ఇంటివారందరు వ్యతిరేకించినా, కుటుంబంలోని వారందరు ఆటంక పరిచినా, దానిపై కృతనిశ్చయంతో ఉండాలి. ఏ విషయాన్ని అసత్యమని భావించిందో దానిని ఎవరి ఒత్తిడి వల్లనూ స్వీకరించకూడదు. తల్లిదండ్రులు, భర్త, ఇతర కుటుంబ పెద్దలు నిశ్చయంగా విధేయత, గౌరవ మర్యాదలకు అర్హులే. వారిపట్ల తిరుగుబాటు, తలబిరుసుతనాల వైఖరి అవలంబించకూడదు. కాని అల్లాహ్, మరియు ఆయన ప్రవక్త (సఅసం) అధికారాల స్థానం మిగతా అందరి అధికారాల కంటే ఉన్నతమయినది. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యొక్క అవిధేయతా మార్గాన్ని అనుసరింప చేయడానికి ఎవరు ప్రయత్నించినా మీరు వారి విధేయతను పూర్తిగా తిరస్కరించండి. వారు తండ్రి అయినా భర్త అయినా సరే; ఈ విషయంలో మీరు ఎవరికీ భయపడనవసరంలేదు. దాని వల్ల ఉత్పన్నమయ్యే చెడు పరిణామాలు మీ ఇహలోక జీవితాన్ని నాశనం చేసేదిగా ఉన్నప్పటికీ దాని భారం అల్లాహ్‌పై వేసి దాన్ని భరించటానికి సిద్ధంకావాలి. ధర్మాచరణలో ఎంత స్థయిర్యాన్ని కనబరిస్తే, దైవం తలిస్తే అంతే మంచి ప్రభావం మన చుట్టుపట్ల ఉన్న సమాజంపై పడుతుంది. చెడిపోయిన ఇండ్ల వాతావరణాన్ని బాగుచేయడానికి వీలు కలుగుతుంది. దీనికి భిన్నం అర్థంపర్థం లేని షరీఅత్ చట్టాలకు విరుద్ధమయిన కోరికలముందు మీరు ఎంతగా లొంగిపోతారో జీవితంలో ఇస్లాం ప్రసాదించే వరాల నుండి కూడా అంతే దూరమవుతారు. అంతేకాక పరిసరాల్లోని సమాజానికి మీద్వారా విశ్వాసంలో నైతికతతో బలహీనమయిన ఒక చెడు నిదర్శనం లభిస్తుంది.

(3) మూడవ కార్యమేమంటే ప్రచార సంస్కారాల విషయంలో మీ ఇంటివారు, మీ సోదరీ సోదరులు, మీ దగ్గరి బంధువుల పట్ల ప్రప్రథమంగా శ్రద్ధచూపించండి, ఏ సోదరీమణులకు దేవుడు సంతానాన్ని ప్రసాదించాడో

వారి చేతికి ప్రత్యేకమయిన పరీక్షా పత్రాలు ఇచ్చాడని అర్థం. దీనిలో వారు ఉత్తీర్ణులయ్యే మార్కులను పొందకపోతే మరే ఇతర పరీక్షాపత్రమయినా ఈ నష్టాన్ని తీర్చజాలదు. వారి శ్రద్ధాశక్తులకు అందరికంటే వారి సంతానానికే అర్హత అధికం. తమ సంతానానికి ధర్మం, ధర్మబోధల శిక్షణ ఇవ్వడం వారి బాధ్యత. వివాహితులయిన మహిళలు తమ భర్తలను ఋజుమార్గంవైపు మరల్చుట వారి విధి. వారు సన్మార్గాన్నే ఉన్నట్లయితే ఆ బాటను అనుసరించటంలో వారికి ఇతోధికంగా సహాయపడాలి. ఒక బాలిక గౌరవ మర్యాదల అవధులను పాటిస్తూ తన తల్లి దండ్రులకు కూడా సద్వచనాన్ని అందించగలదు. అధమం, మంచి పుస్తకాలను వారి అధ్యయనంలో ప్రవేశ పెట్టడమయినా మహిళలు సునాయాసంగా చెయ్యగలరు.

(4) నాల్గవ కార్యం మీరు మీ కర్తవ్యంగా ఎంచి నిర్వహించవలసిందేమంటే, మీరు మీ ఇంటి బాధ్యతల నిర్వహణ తరువాత మిగల్చగల సమయాన్ని ఇతర మహిళలకు ధర్మ జ్ఞానాన్ని అందించడంలో వినియోగించాలి. చిన్న బాలికలకు విద్య నేర్పండి; వయస్సుగల స్త్రీలకు చదువు చెప్పండి; చదువుకున్న స్త్రీలకు ఇస్లాం పుస్తకాలను అందించండి; నియమానుసారముగా మహిళల సమావేశాలు జరిపి వారికి ధర్మాన్ని బోధించండి; మీరు ఏఏ రీతుల్లో పని చేయగలరో చేయండి. అవకాశం కలిగినంత వరకు మీకు పరిచయమున్న స్త్రీలలో నుండి అజ్ఞానాన్ని మూఢత్వాన్ని దూరం చేయడానికి సకల ప్రయత్నాలను చెయ్యండి.

(5) విద్యావంతులయిన మహిళలపై మరో బాధ్యతపడుతుంది. ఇది యితర కార్యాలయాలన్నింటికంటే ప్రాధాన్యత గల కార్యం. ప్రస్తుతం పాశ్చాత్య నాగరికతకు బానిసలయిన కుటుంబాల స్త్రీలు సాధారణ ముస్లిం మహిళల్ని మార్గ భ్రష్టత అశ్లీలత, మానసిక, నైతిక అరాచకతల వైపునకు ఈడ్చుకొని పోతున్నారు. దీన్ని పూర్తి శక్తితో ప్రతిఘటించాలి. ఈ కార్యం కేవలం

పురుషులు చేస్తే నెరవేరదు. పురుషులు ఈ చెడును ఎదుర్కొన్నప్పుడు "ఈ పురుషులు మిమ్మల్ని బానిసలుగా వుంచటానికే కంకణం కట్టుకున్నారు. స్త్రీలు నాలుగు గోడల మధ్య నలిగి నలిగి చావాలనే వారు సదా వాంఛిస్తుంటారు. స్త్రీలకు స్వేచ్ఛావాయువు సోక కూడదనే వారి అభిలాష" అని సాధారణ మహిళల్ని పెడత్రోవన త్రొక్కిస్తారు. కాబట్టి ఈ విపత్తును అరికట్టడంలో స్త్రీ సహాయం ఎంతయినా అవసరం. దైవభక్తి గల సత్ప్రవర్తనాశీలురయిన విద్యాధికులయిన మహిళలు, బుద్ధి విజ్ఞానాల్లో, మేధాసంపత్తిలో, వాక్శక్తిలో, రచనా శక్తిలోనూ పాశ్చాత్య నాగరికతా బానిసలయిన నారీమణులకంటే ఏమాత్రం తీసిపోనట్టి మహిళలు, దేవుని దయవల్ల, మనదేశంలో కొరవగాలేరు. విద్యాధికులయిన మహిళలు, మేధాసంపత్తితో, వాక్ శక్తితో ముందంజవేసి వారికి తగినట్లుగా జవాబు చెప్పడం ఇప్పుడు వీరికర్తవ్యం. ముస్లిం మహిళ దైవ నియమాలకు ఆవల అడుగు పెట్టడానికి ఎంత మాత్రం సిద్ధంగా లేదని ఆమె, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(సఅసం) నిర్ణయించిన అవధులను అతిక్రమించి సాధించే ప్రగతిని అసహ్యించుకుంటుందనీ, నిరసిస్తుందనీ వారికి తెలిసి వచ్చేటట్లుగా ఘంటాపథంగా చాటాలి. ఇంతే కాకుండా, ఏ ఆవశ్యకతలను ఇస్లాం అవధుల్ని అతిక్రమించకుండా వాటిని సాధించలేమని వారంటారో వాటిని ఇస్లాం అవధుల్లోనే తీర్చడానికి సంఘటితంగా కృషి చేసి సాధ్యమనిపించాలి. తద్వారా ధర్మ భ్రష్టతను ప్రచారం చేసి స్త్రీ పురుషులు నోరెత్తి మాట్లాడకుండా చెయ్యాలి.

సమాప్తం